సాక్షి 24|7
తూర్పుగోదావరి
బుధవారం
23-8-2017



వస్తున్నా..

26న జగన్ రాక

నగరపాలక సంస్థ ఎన్నికలు జరుగుతున్న కాకినాడలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 26వ తేదీన పర్యటించనున్నారు. ఈ నెల 23 నుంచి రెండ్రోజులపాటు జగన్ పర్యటనకు రావాల్సి ఉన్నప్పటికీ వినాయక చవితి పండుగ నేపథ్యంలో షెడ్యూల్‌లో మార్పు చేశారు. 26వ తేదీ ఉదయం జగన్ హైదరాబాద్ నుంచి కాకినాడ వచ్చి నగరంలో విస్తృతంగా పర్యటిస్తారు. 27వ తేదీన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరి వెళతారు.

- వివరాలు మెయిన్లో...

కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఇళ్లు 4,608

స్థలం గుర్తించకుండానే మంజూరు చేసేసినట్టు హడావుడి

కార్పొరేషన్‌లో సొంతిళ్ల కోసం వచ్చిన దరఖాస్తులు 43 వేలు

హుటాహుటిన స్వీకరించిన డీడీలు

మంజూరు ముసుగులో ముడుపులు వసూళ్లు

పేదలను మభ్యపెట్టి ఇదిగో ఇల్లంటూ... కోట్లాది రూపాయలను లబ్ధిదారుల వాటాగా కట్టించేశారు. ఇళ్లు మంజూరయ్యాయంటూ పెద్ద ఎత్తున ముడుపులు వసూలు చేశారు. ఇదేమీ తెలియని పేదోడు సొంత గూడు వస్తుందన్న గంపెడాశతో అధికార పార్టీ నేతలు చెప్పినట్టు చేశారు. తీరా చూస్తే ఇల్లు రాలేదు. కేంద్రం కేటాయించిన ఇళ్లను గుట్టు చప్పుడు కాకుండా అధికార పార్టీ నాయకులు పంచేసుకున్నారు. అదెలా అంటే..!

ఇల్లు... గుబిల్లు

- ఇది మోసం కాదాని జనం ప్రశ్న
- మంజూరు కాకుండానే మామూళ్ల వసూలు
- స్థలం లేకపోయినా ఇళ్లిస్తామని మోసం
- హుటాహుటిన డీడీలు కట్టించేసిన వైనం
- కేంద్రం కేటాయింపుల మేరకు 'పచ్చ' నేతలకు పంపకం
- కాకినాడ పేదల ఆశలపై 'దేశం' నేతల నీళ్లు
- ఎమ్మెల్యే కొండబాబు కనుసన్నల్లో అవినీతి బాగోతం

కుడి, ఎడమల దగా..



సాక్షి ప్రతినిధి, కాకినాడ : అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ఇల్లూ మంజూరు చేయలేకపోయిన అధికార తెలుగుదేశం ప్రభుత్వం కేంద్రం ప్రవేశం పెట్టిన గృహ నిర్మాణ పథకాన్ని కూడా అపహాస్యం చేస్తోంది. పేదల సొంతింటి కలపై నీళ్లు చల్లుతోంది. గృహ నిర్మాణాలకు స్థలం గుర్తించకుండానే, పేదలకు ఇల్లు మంజూరు చేయకుండానే అర్హులైన వారందర్నీ దగా చేస్తున్నారు. కేంద్రం నుంచి వచ్చే ఇళ్లు తర్వాతైనా వస్తాయంటే అదీ ఉండదు. ఎందుకంటే...

- మిగతా 2లో

బాలయ్యా.. రాకుంటేనే మేలయ్యా!



- నంద్యాలలో 'నోట్ల' నిర్వాకంతో పార్టీకి నష్టం
- అభిమానిపై చేయి చేయి చేసుకోవడంతో కలవరం
- కాకినాడలో టీడీపీ శ్రేణుల్లో భయం, భయం

వివరాలు 9లో

పాదయాత్రకు మరోసారి ఆటంకం



కిర్లంపూడి మెయిన్ రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామ కాపు మహిళలు

7లో

జనహోరు



కాకినాడ 35వ డివిజన్‌లో మంగళవారం భారీ ర్యాలీగా ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కుడి, ఎడమల దగా...

▶ మొదటి పేజీ తరువాయి

ముందస్తుగా 'పచ్చ'నేతలు వాటిని తమ గుప్పెట్లో పెట్టేసుకున్నారు.

దరఖాస్తులు 43 వేలు– కేటాయింపులు 4,608

ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో ఇళ్ల మంజూరు చేస్తామంటూ కేంద్రం ప్రకటించడంతో జిల్లా కేంద్రం కాకినాడలో దాదాపు 50 డివిజన్ల నుంచి ఇప్పటి వరకు 43 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. కానీ 4,608 ఇళ్లు మాత్రమే కేంద్రం కేటాయించింది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి, అర్హులైన వారిని ఎంపిక చేసి, లబ్ధిదారుల నుంచి వారివాటా సొమ్మును స్వీకరించాల్సి ఉంది. కానీ టీడీపీ నేతలు దానికి భిన్నంగా తమకు నచ్చినట్టుగా, తెలుగు తమ్ముళ్లకు ఉపయోగపడేలా, నిరుపేదలను దగా చేసే విధంగా కేంద్ర పథకాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నారు.

స్థల సమస్య కప్పిపుచ్చి...

పీఎంఏవైలో ఇళ్ల నిర్మాణం కోసం పర్లోపేటలో 47 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. అయితే అందులో 25 ఎకరాలు జీప్లస్ 3 నిర్మాణాలకు ఏ మాత్రం అనువుగాలేవని ఓ అధ్యయనంలో బయటపడింది. సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో దాదాపు 25 ఎకరాలు ఊబిగా నిర్ధారణవడంతో ఇక్కడ జరిగే నిర్మాణాలు భవిష్యత్తులో భూమిలోకి కుంగే అవకాశం కూడా ఉందని నివేదికలు స్పష్టం చేశాయి. అయితే ఇవన్నీ పక్కన పెట్టి త్వరలోనే టు బెడ్ రూమ్ ఫ్లాట్‌లు వచ్చేస్తున్నాయంటూ దరఖాస్తుదారులను మభ్యపెట్టి వారి వాటా సొమ్మును కట్టించేశారు.

ఏమీ లేకుండానే ఎంపిక హడావుడి

గృహ నిర్మాణాల లబ్ధిదారుల ఎంపిక అంతా పేదలను మభ్యపెట్టే విధంగానే జరిగింది. కేంద్రం కేటాయించిన ఇళ్లు మేరకు టీడీపీ అనుయాయులతో జాబితా తయారు చేసేశారు. కానీ ఇదంతా గుట్టుగా ఉంచేసి అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరైనట్టు చెప్పి ఏమీ లేకుండా డీడీలు కట్టించి మభ్య పెట్టే ప్రయత్నం చేశారు. డీడీలు కట్టించేస్తే తమపైనే నమ్మకం పెట్టుకుంటారని, ఇల్లు వస్తుందని చెప్పి పేదలను తమ వెనక తిప్పించుకోవచ్చనే ధోరణితో వ్యూహాత్మకంగా వ్యవహరించారు. వాస్తవానికై తే, కార్పొరేషన్ పరిధిలో వచ్చిన 43 వేలకు పైగా దరఖాస్తుల్లో సీనియారిటీ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అదేమీ లేకుండా దశాబ్దాలుగా సొంతిల్లులేక వేచి చూస్తున్న పేదల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే హడావుడిగా 4,608 మంది జాబితాను ప్రకటించేశారు.

పనిలో పనిగా వసూళ్లు...

ఇల్లు ఇచ్చింది...చేసింది లేదు. కానీ, ఇల్లు మంజూరైం దంటూ ముడుపుల పర్వం సాగించారు. అధికార పార్టీ అనుయాయుల ఒక్కొక్కరి నుంచి రూ. 10 వేల వరకు వసూళ్లు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరితోపాటు జన్మభూమి కమిటీ సభ్యులు కూడా చేతివాటం ప్రదర్శించి ఒక్కో ఇంటికి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారు.



ఏడేళ్ళ క్రితం పెదసింగి దుర్గారావు తీసిన రూ.26వేలు డీడీ నకలు



పీఎంఏవై ఇళ్ళ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

తతంగమంతా ఎమ్మెల్యే కార్యాలయం నుంచే...

ఇళ్లు వస్తున్నాయన్న ఆశతో నేతలు చెప్పిన మేరకు నిరుపేదలు అక్కడా, ఇక్కడా అప్పులు చేసి డీడీలు కట్టేశారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరావు కార్యాలయం నుంచి ఇల్లు మంజూరైందంటూ సమాచారం పంపించారు. ఎమ్మెల్యే చెప్పారనుకుని పేదలు కూడా యుద్ధ ప్రాతిపదికన డీడీలు చెల్లించేశారు. వాస్తవానికైతే వారికి ఇల్లు మంజూరే కాలేదు. ఈ రకంగా మంజూరు కాకుండా సుమారు 3,500 మంది ఇప్పటికే సొమ్ములు చెల్లించేశారు. విశేషమేమిటంటే ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే నేరుగా దరఖాస్తుదారులొచ్చి డీడీలు కట్టడం చూసి కార్పొరేషన్ అధికారులు సైతం షాకయ్యారు. డీడీలు కట్టండని చెప్పకుండానే కార్యాలయానికి నేరుగా రావడంపై కార్పొరేషన్ అధికారులు అభ్యంతరం కూడా వ్యక్తం చేశారు. దీంతో దరఖాస్తుదారులంతా తిరిగి ఎమ్మెల్యే వనమాడి ఇంటికి వెళ్లగా...ఎమ్మెల్యే అనుచరులు వెంటనే మేల్కొని ముందు డీడీలు తీసుకోండి...తర్వాత చూద్దామంటూ చెప్పడంతో కార్పొరేషన్ అధికారులు కాదనలేక వచ్చిన కాడికి డీడీలు తీసేసుకున్నారు. వాటిని ఏమి చేయాలో తెలియక మూలనప డేశారు. ఈ రకంగా కార్పొరేషన్‌కు రూ. 8 కోట్ల వరకూ డీడీలు వచ్చినట్టు సమాచారం.

గత లబ్ధిదారులకు అతీగతి లేదు...

కాంగ్రెస్ హయాంలో ఐహెచ్ఎస్‌డీపీలో 1750 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో తొలి విడత ఏటిమొగ, పర్లోపేటల్లో 816 మందికి ఇళ్లు మంజూరు చేశారు. మిగిలిన 934 మంది లబ్ధిదారులు రూ.26 వేలు నుంచి రూ.83 వేలు వరకు తమ వాటా సొమ్మును అప్పట్లోనే చెల్లించారు. అప్పులు చేసి మరీ అప్పట్లో వాటా సొమ్ము చెల్లించినవారికి ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లు మంజూరు చేయించాల్సి ఉండగా ఇప్పుడు ఆ లబ్ధిదారులను కనీసం పట్టించుకోవడం లేదు. దాదాపు మూడుకోట్ల రూపాయలు డీడీల రూపంలో వీరిచ్చిన సొమ్ము గృహ నిర్మాణశాఖలో మూలుగుతున్నాయి. అర్హత కలిగి, సొమ్ముకట్టి ఏళ్లు గడిచినా తమకు ఇల్లు ఎప్పుడు మంజూరవుతుందా అని గత లబ్ధిదారులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఏడేళ్లుగా ఎదురుచూపు...



టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నా ... కాకినాడ పరదేశమ్మపేటలో నివాసం ఉంటున్నా. కోనసీమ నుంచి 30 ఏళ్ల కిందట ఇక్కడకు వచ్చినా. నా ఇద్దరు పిల్లలు ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు. ఇక్కడ సొంత స్థలంకానీ, ఇల్లుకానీ లేకపోవడంతో ప్రభుత్వ పథకంలో ఇల్లు వస్తుందని ఆశపడి రూ.26 వేలు అప్పు చేసి మరీ డీడీ కట్టా. అర్హత ఉన్నా నాకు ఇప్పటి వరకు ఇల్లు మంజూరు కాలేదు.

– వైదాడి నాగేశ్వరరావు పరదేశమ్మపేట, కాకినాడ

నెరవేరని ఆశ...



లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ప్రభుత్వా ల మాటలు నమ్మి దగాపడ్డా. ఏడేళ్ల కిందట సొంతిల్లు వస్తుందని అప్పుచేసి మరీ రూ.26 వేలు కట్టా. ఏడేళ్లుగా ఇల్లూ రాక, కట్టిన సొమ్ము తిరిగి రాక మోసపోయా. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోతోంది.

– పెదసింగి దుర్గారావు, నున్నవారివీధి, కాకినాడ

అద్దెలు కట్టలేక...



సొంతింటికోసం ఏడేళ్ల నా వాటా సొమ్ము కూడా చెల్లించా. భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నా. కాయకష్టంతో రోజులు వెళ్ళదీస్తున్న నాకు ఇంత వరకూ గూడు సమకూరలేదు. ఇల్లు వస్తుందని ఆశపడి డబ్బు కట్టి ఏడేళ్లు గడిచినా పట్టించుకునేవారే కరువయ్యారు. కాకినాడ నగరంలో ఇంటి అద్దెలు బాగా పెరిగిపోవడంతో నెలనెలా అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నా.

– గోళీలపేటకు చెందిన బాదం కనకమహాలక్ష్మి, జగన్నాథపురం

ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు ఎర

మంత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం


ఉపాధ్యా, ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు, చిత్రంలో మంత్రి కళావెంకటరావు తదితరులు

కాకినాడ రూరల్ : కాకినాడ కార్పొరేషన్ ఎన్నిక రసవత్తరంగా మారడంతో ఓటర్లను తమ వైపు మలచుకునేందుకు టీడీపీ నాయకులు కొత్త పంథా ఎంచుకున్నారు. ఈసారి ప్రత్యక్షంగా కొంతమంది ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ద్వారా ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించేందుకు ఉపాధ్యాయులే సరైన వారధులుగా ఎంచుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కార్పొరేషన్‌ను గెలిపించండి, మీకు ఏమి అవసరమో వాటిని మేం సమకూరుస్తాం, గుట్టుచప్పుడు కాకుండా ప్రజల్లోకి వెళ్లి నచ్చజెప్పి ఓట్లు వేయించండంటూ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు చెప్పినట్లు సమాచారం. మంత్రి కళావెంకటరావు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ చైతన్య రాజు, ఎమ్మెల్సీ బొడ్డు భాస్కర రామారావు, రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిలతోపాటు పార్టీ శ్రేణులంతా మంగళవారం రాత్రి కాకినాడ గైగోలుపాడులోని చైతన్య నగర్‌లో ఉన్న చైతన్య కళాశాలలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులు, ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు, వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులతో ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తూ వారి ద్వారా ఓటర్లకు అందించే తాయిలాలు ఇచ్చినా ఏ ఒక్కరికీ అనుమానం రాకుండా ఉంటుందని, ఈ దిశగా టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పార్టీ వర్గాలు నిర్ణయించినట్లు ఆ పార్టీకి చెందిన పలువురు గుసగుసలాడుతున్నారు. ఏఏ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఆయా ప్రాంతాల్లోనే ఓటర్లను కలుసుకునేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని టీడీపీ నాయకులు మంత్రుల సమక్షంలోనే ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులకు ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కె.రవికిరణ్ వర్మ, ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, టీడీపీ నాయకులు పిల్లి సత్యనారాయణమూర్తి, మెట్ల రమణబాబు తదితరులు ఉన్నారు.

లక్కవరం జంక్షన్లో అంబులెన్స్ దగ్ధం



మోతుగూడెం (రంపచోడవరం) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అంబులెన్స్ జిల్లాలోని తులసిపాక సమీపంలోని లక్కవరం జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం దగ్ధమైంది. కొత్తగూడెం నుంచి మారేడుమిల్లి వెళ్తున్న ఈ అంబులెన్స్ లక్కవరం వై.జంక్షన్ వద్ద షార్ట్ సర్క్యూట్ అయి పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అంబులెన్స్ ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని మోతుగూడెం ఎస్సై వి.కిశోర్ తెలిపారు.

గిరిజన సహకార సంస్థ లి., రంపచోడవరం

రేఖాసంఖ్య నెం.23/2017–డి. ఆర్స్ తేది. 22–08–2017

టెండరు ప్రకటన

రంపచోడవరం ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ వసతి గృహములు, ఆశ్రమ పాఠశాలలు మరియు రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు అవసరమగు నిత్యావసర సరుకులు సెప్టెంబరు 2017 నుండి నవంబర్ 2017కు (3 నెలలకు) అరువు పద్ధతిలో సరుకులు సరఫరా చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తి గలవారు తమ టెండర్లను ది. 29–08–2017 మధ్యాహ్నం 01–00 గంట వరకు గిరిజన సహకార సంస్థ లి., రంపచోడవరం, డివిజనల్ మేనేజరు వారి కార్యాలయములో సమర్పించగలరు. టెండరుఫారంతో పాటు ఇ.ఎమ్.డి. రూపంలో నిత్యావసర వస్తువుల సరఫరాదారులు రూ.2,00,000/– (రెండు లక్షల మాత్రమే) ఏదైనా జాతీయ బ్యాంకు నందు డిమాండు డ్రాఫ్టును డివిజనల్ మేనేజర్, గిరిజన సహకార సంస్థ లి., రంపచోడవరం వారి పేరు మీద చెల్లుబడి అగునట్లు తీసి తప్పనిసరిగా జతపర్చవలెను. ఈ విషయంలో సహకార ఏజెన్సీలు/చిన్న తరహా పరిశ్రమలతో పాటు మరెవరికి ఎటువంటి మినహాయింపులు ఉండవు. అదే రోజు మధ్యాహ్నం 03.00 గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండరు–కమ్–నెగోషియేషన్స్ శ్రీ ప్రాజెక్టు అధికారి, ఐటిడిఎ, రంపచోడవరం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడును. టెండరు ఫారముతో రేటు దాఖలు చేసిన టెండరుదారులు ప్రతీ సరుకునకు ఒక కేజీ పరిమాణమునకు తక్కువ కాకుండా శాంపిల్స్ తీసుకుని రావలెను. శాంపిల్స్ తీసుకుని రాని టెండరుదారులు ఆ సరుకు పాడుటకు అర్హులు కారని తెలియజేయుచున్నాము. జిఎస్‌టి రిజిస్ట్రేషన్ లైసెన్స్ మరియు పాన్ నెంబరు గల రెండు సంవత్సరముల ఆదాయపు పన్ను రిటర్నులు తాలూకు కాపీలు టెండరు ఫారమునకు జతపరచి సమర్పించవలెను. పైవన్నీ లేనియెడల టెండర్లు స్వీకరింపబడవు. దీనికి సంబంధించిన టెండరు ఫారములు జి.సి.సి, రంపచోడవరం, డివిజనల్ కార్యాలయంలో రూ.1,000/– ధరావత్తు చెల్లించి పొందగలరు.

కాంటాక్టు నెంబర్ 08864–243529

సం//– ఎ.ఎస్.దినేష్‌కుమార్
ప్రాజెక్టు ఆఫీసర్, ఐ.టి.డి.ఎ /
ఛైర్మన్ పర్చేజ్ కమిటీ, జి.సి.సి. రంపచోడవరం


తపస్వికొండ రక్షిత అటవీప్రాంతంలో రంగురాళ్ల క్వారీని పూడ్చివేయిస్తున్న అడ్డతీగల సీఐ మురళీకృష్ణ

రంగురాళ్ల తవ్వకాల నిరోధానికి
నిఘా పటిష్టం

ఇటీవల తవ్వకాలు జరిపిన క్వారీ పూడ్చివేత

అడ్డతీగల (రంపచోడవరం) :

తపస్వికొండ రక్షిత అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాల నిరోధానికి నిఘా పటిష్టం చేసినట్లు అడ్డతీగల సీఐ ఆకుల మురళీకృష్ణ తెలిపారు. రంగురాళ్ల తవ్వకాలు జరుగుతాయని గుర్తించిన ప్రాంతాల్లో మంగళవారం సిఐ తన సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈమేరకు తపస్వికొండ రక్షిత అటవీప్రాంతాల్లో వివిధ ప్రాంతాలను సందర్శించారు. ఇటీవల కొన్ని రోజుల నుంచి జిల్లాలో వివిధ ప్రాంతాలకు బందోబస్తు విధులకు తామంతా వెళ్లి తిరిగి వచ్చిన అనంతరం రంగురాళ్ల తవ్వకాలపై నిఘా పెంచే చర్యల్లో భాగంగా మంగళవారం క్వారీల వద్దకు వెళ్లామని, అందులో భాగంగా తపస్వికొండ రక్షిత అటవీప్రాంతంలో ప్లాంటేషన్ క్వారీ (ఎర్రక్వారీ) వద్ద మళ్లీ తవ్వకాలు జరిగినట్లు గుర్తించామన్నారు. సిబ్బందితో కలసి ఆ క్వారీని పూడ్చివేశామన్నారు. తవ్వకాలు జరిపినా, తవ్వకందారులను వ్యాపారులు ప్రోత్సహించినా చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగా వ్యాపారులుగా గుర్తించిన వారికి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. అయినా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. సీఐతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ ముమ్మరం

హైడ్రోజన్ ట్యాంకర్ పేలుడు ఘటనపై కదలిన యంత్రాంగం

పెద్దాపురం : స్థానిక సుధా ఆగ్రో ఆయిల్ ఇండస్ట్రీలో గత రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై అధికారులు విచారణ ముమ్మరం చేశారు. ప్యాక్టరీ యాజమాన్యం ప్రవర్తించిన తీరుపైన అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. డీఎస్పీ సీహెచ్ రామారావు పర్యవేక్షణలో ఘటనకు సంబంధించి కార్మికులను ఆరా తీస్తున్నారు. తొలిరోజు కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు లేవన్న యాజమాన్యం ఆ సమయంలో సుమారు 30 మంది గాయపడినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టినట్లు తెలిసింది. అయితే యాజమాన్యం అధికారులకు పూర్తి సమాచారాన్ని సక్రమంగా అందివ్వకపోవడం ప్రజా సంఘాల నుంచి వస్తున్న ఆరోపణల నేపథ్యంలో యాజమాన్య తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజనిర్ధారణ కమిటీ వేసి ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కార్మిక యూనియన్ ఉన్నట్టా..? లేనట్టా...?

ప్యాక్టరీలో ఉండాల్సిన కార్మిక యూనియన్ ఉందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై అధికారులకు సరైన సమాచారం అందడం లేదు. ఘటన అర్థరాత్రి జరగడంతో కార్మికులు కనీసం 30 నుంచి 40 మందికి పైగా రాత్రివేళ సీ షిఫ్టులో విధులు నిర్వర్తించే అవకాశం ఉంది. అయితే ఆ సమయంలో ఎవరూ లేరంటూ యాజమాన్యం చేసిన ప్రకటనపై పలు అనుమానాలు వ్యకతమౌతున్నాయి.

మూతబడే దశలో ఉన్నందుకేనా...?

ప్యాక్టరీలో ఓ విభాగం మూతబడే దశలో ఉన్నట్లు ప్రకటనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరిగిన ఘటనపై బిన్నభిప్రాయాలతో పాటు పలు అనుమానాలకు తావిస్తోంది. ఆయా అంశాలపై అధికారులు విచారణ ముమ్మరం చేసి నిజ నిర్ధారణ కమిటీతో పాటు విచారణ వేగవంతం చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మైక్రో ప్రాజెక్టులను మరింత బలోపేతం చేయాలి

సామర్లకోట : పట్టణ పరిధిలో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న మైక్రో ప్రాజెక్టులను మరింత బలోపేతం చేయాలని మెప్మా రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రభావతి పిలుపు నిచ్చారు. జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల్లో మహిళా సంఘాల్లో ఉండి డిగ్రీ పూర్తి చేసిన మహిళా సభ్యులను ఎంపిక చేసి మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్ కమ్యూనిటీ కన్సల్టెంట్లకు మూడు రోజుల పాటు స్థానిక టీడీసీలో నిర్వహించే ప్రారంభ రోజు శిక్షణలో మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిక్షణ పొందిన సభ్యులు మున్సిపాలిటీల్లోని మహిళా సంఘాల వద్దకు వెళ్లి ఆయా ప్రాంతాల్లో అవసరాలను గుర్తించి దానికి తగిన విధంగా వ్యాపారాలు చేయడానికి వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు బ్యాంకు రుణాలు ఇప్పించాలన్నారు. అలాగే ఇప్పటికే వ్యాపారాలు చేసుకుంటున్న మహిళా సంఘాల సభ్యులకు చెందిన వ్యాపారాలు మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ కేవీ రతన్‌బాబు, జిల్లా రిసోర్సు పర్సన్ పి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మె విజయవంతం


మాట్లాడుతున్న బ్యాంక్ యూనియన్ ప్రతినిధులు

బాలాజీచెరువు (కాకినాడ) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా బ్యాంక్ ఉద్యోగులు మంగళవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె విజయవంతమైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు కాకినాడ మెయిన్‌రోడ్ ఎస్‌బీఐ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ యూనియన్ ఫోరం కన్వీనర్ పి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల భారతదేశంలో ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన కులాల వారికి ఏంతో నష్టం వాటిల్లుతోందన్నారు. బడా పారిశ్రామికవేత్తల నుంచి రూ. 2.40 లక్షల కోట్లు మొండిబకాయిలుగా మారాయని, వాటిని వెంటనే రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫోరం నాయకులు త్రిమూర్తులు, రాజేంద్ర, శ్రీనివాసరావు, పాండు రంగారావు, శ్యామ్‌కుమార్, మురళీకృష్ణ, దుర్గాప్రసాద్, అరుణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

బాలాజీచెరువు (కాకినాడ సిటీ) : గ్రామీణ తపాలా ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె మంగళవారానికి ఏడో రోజుకు చేరుకుంది. కమలేష్ చంద్ర కమిటీ రిపోర్ట్‌ను వెంటనే అమలు చేయాలని యూనియన్ నాయకులు కోరారు. గ్రామీణ తపాలా ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు ఎన్.సూర్యనారాయణ, రామానుజయ్య, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో భారీ కొండచిలువ హతం


చనిపోయి ఉన్న కొండచిలువతో స్థానికులు

మోతుగూడెం (రంపచోడవరం) : మండలంలోని మోతుగూడెంలో మంగళవారం ఓ భారీ కొండచిలువ హతమైంది. ఈ గ్రామంలోని షీర్డి సాయి బాబా ఆలయ సమీపంలో పది అడుగుల పొడవు ఉన్న కొండచిలువ చనిపోయి స్థానికులకు కనిపించింది. దీనిని చూడటానికి స్థానికులు తరలివచ్చారు.

రైలు నుంచి జారి పడి విద్యార్థి మృతి


మృతుడు శ్రీవీరశివ ప్రసాద్

సామర్లకోట (పెద్దాపురం) : సామర్లకోట రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం రైలు నుంచి జారి పడి ఒక విద్యార్థి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం కిర్లంపూడి మండలం సింహాద్రిపురానికి చెందిన నామాల శ్రీవీరశివప్రసాద్ పోటీ పరీక్ష రాయడానికి భువనేశ్వర్ వెళ్లాడు. పూరి నుంచి రాజమహేంద్రవరం టిక్కెట్టు తీసుకుని రైలులో వస్తూ సామర్లకోట దాటిన తరువాత సుగర్ ఫ్యాక్టరీ గెస్టు హౌస్ సమీపంలోని కేఎం నెంబరు 627/31–33 పోస్టుల మధ్య పట్టాలపై పడి అక్కడిక్కడే మృతి చెందాడు. బీటెక్ పూర్తి చేసిన ప్రసాద్ రాజమహేంద్రవరంలో కోచింగ్ తీసుకున్నాడు. ప్రసాద్‌కు తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు. మృతదేహం వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా అతడి వివరాలు గుర్తించారు. రైల్వే కీమేన్ పట్టాలపై పడి ఉన్న మృత దేహాన్ని గుర్తించి రైల్వే స్టేషన్ మేనేజరుకు తెలిపారు. స్టేషన్ మేనేజరు శాస్త్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పెద్దాపురం తరలించి హెచ్‌సీ పి.విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులను వ్యాపారులుగా చేయడమే లక్ష్యం

- ఈటీసీ ప్రిన్సిపాల్ కైలాస్ గిరీశ్వర్
- ఎఫ్‌పీఓ సభ్యులకు ఫీల్డ్ విజిట్
- 13 జిల్లాల సేవా సంస్థల సభ్యులకు శిక్షణ


ఎఫ్‌పీఓలో శిక్షణ పొందుతున్న వారికి ఫీల్డు విజిట్ నిర్వహించిన దృశ్యం

సామర్లకోట (పెద్దాపురం) : ఫార్మర్స్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) సభ్యులకు మంగళవారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో 13 జిల్లాలకు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, ఎఫ్‌పీఓ డైరెక్టర్లకు మూడు రోజుల శిక్షణలో భాగంగా మంగళవారం రైస్ మిల్లుకు తీసుకువెళ్లి ధాన్యానికి ఏ విధంగా పాలిష్ పెడతారో అవగాహన కల్పించారు. అదే విధంగా రైస్ బ్యాగ్‌లు ప్యాకింగ్ చేసే విధానాన్ని వివరించారు. రైతులను నేరుగా వ్యాపారస్తులుగా చేయడానికి శిక్షణ ఇస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ ఆర్గనైజేషన్ల ద్వారా రైతులకు కావలసిన సరకులను కొనుగోలు చేయడమే కాకుండా రైతులు పండించిన పంటలను ఈ సంస్థ ద్వారా విక్రయించే అవకాశం ఉంటుందని రెండో రోజు శిక్షణలో ఈటీసీ ప్రిన్సిపాల్ తోట కైలాస్ గిరీశ్వర్ పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా మధ్యవర్తులు లబ్ధి పొందుతున్నారనే ఆరోపణల మేరకు రైతులతో ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి దానిలో సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఆర్గనైజేషన్ ద్వారా అమ్మకాలు చేసిన పంటల్లో వచ్చిన లాభాలను రైతులకు పంచనున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా సంస్థలను ఏర్పాటు చేయడానికి సేవా సంస్థల సభ్యులను ఆహ్వానించి ఈ సంస్థ లక్ష్యాలను తెలియజేయనున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఎఫ్‌సీఓ సంస్థ సభ్యులచే అవగాహన కల్పించనున్నామన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీ) ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫీల్డ్ విజిట్‌లో ఫ్యాకల్టీలు జె.రాంబాబు, రామ్మోనరావు గోపాలరావు, ఎస్‌కే మొహిద్దీన్‌లు పాల్గొన్నారు.

భవిష్యం

మేషం: పనుల్లో జాప్యం. ఆరోగ్యసమస్యలు. దూరప్రయాణాలు. సోదరులతో విభేదాలు. శ్రమ తప్ప ఫలితం ఉండదు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళం.

వృషభం: బంధువర్గం నుంచి ఒత్తిడులు. ఆధ్యాత్మిక చింతన. పనులు ముందుకు సాగవు. ప్రయాణాల్లో మార్పులు. దైవదర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు.



మిథునం: నూతన వ్యక్తుల పరిచయం. శుభవార్తలు వింటారు. కొత్త విషయాలు తెలుస్తాయి. విద్యార్థుల కలలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

కర్కాటకం: శ్రమ తప్పకపోవచ్చు. కొన్ని వ్యవహారాలు ముందుకు సాగవు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆకస్మిక ప్రయాణాలు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు.

సింహం: సన్నిహితులతో ఉత్సాహంగా గడుపుతారు. సేవలకు గుర్తింపు రాగలదు. ఆహ్వానాలు అందుతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

కన్య: రుణదాతల ఒత్తిడులు. ఆలయాలు సందర్శిస్తారు. బంధువులతో తగాదాలు. అనారోగ్యం. ఊహించని ప్రయాణాలు. వృత్తి, వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

తుల: ప్రముఖులతో పరిచయాలు. సంఘంలో గౌరవం. ఆస్తి విషయాలలో ఒప్పందాలు. వాహనయోగం. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు ఒడిదుడుకులు తొలగుతాయి.

వృశ్చికం: చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. పలుకుబడి పెంచుకుంటారు. విద్య, ఉద్యోగావకాశాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలు సజావుగానే సాగుతాయి.

ధనుస్సు: పనుల్లో ఆటంకాలు. దుబారా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. దూరపు బంధువుల కలయిక. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో చిక్కులు.

మకరం: ఆదాయానికి మించి ఖర్చులు. ప్రయాణాలు వాయిదా. పనులలో ఆటంకాలు. స్నేహితులతో కలహాలు. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి.

కుంభం: శుభకార్యాలలో పాల్గొంటారు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో పురోభివృద్ధి. ఉద్యోగులకు ఒత్తిడులు తొలగుతాయి.

మీనం: చిరకాల మిత్రులను కలుసుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. బాకీలు వసూలవుతాయి. వాహనయోగం. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు.

– సింహంభట్ల సుబ్బారావు

అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీలో సెమిస్టర్ విధానం అమలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరంసిటీ) : విజ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాల్ని అందిపుచ్చుకునేలా అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఈ ఏడాది నుంచి సెమిస్టర్ విధానాన్ని అమలుచేస్తున్నదని ఆ యూనివర్సిటీ స్టడీసెంటర్ కో ఆర్డినేటర్ ఆర్.రమేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జారీచేసిన ఉత్తర్వుల విడుదల చేసిందన్నారు. ఈ విద్యాసంవత్సరం డిగ్రీలో చేరే విద్యార్థులు చాయిస్‌బెస్ట్ క్రెడిట్ సిస్టమ్‌లో సబ్జెకులను ఎంపిక చేసుకోవాలన్నారు. గతానికి భిన్నంగా డిగ్రీ తొలిసంవత్సరంలోనే బీఏ, బీకాం, బీఎస్సీ సబ్జెక్టులను ఎంపికచేసుకోవాలన్నారు. ఈ ఎంపికలో అభ్యర్థులకు పూర్తిస్వేచ్ఛ ఉంటుందని, దీనివల్ల సిలబస్ భారం తగ్గుతుందన్నారు. ఏడాదికి బదులు ఆరునెలలకు ఒకసారి పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తిచేసుకోవచ్చన్నారు.

రేపటితో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు గడువు ముగింపు

డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాయలంలో అన్ని డిగ్రీ, పీజీ ప్రవేశాలకు ఈనెల 24తో గడువు ముగుస్తుందన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ పలు డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు.

నేడు ట్రాన్స్‌పోర్ట్ మేళా

అమలాపురం రూరల్: అమలాపురం ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం పరిధిలో ఆటోడ్రైవర్లకు బుధవారం ఆటో రిక్షా ట్రాన్స్ పోర్ట్ మేళా నిర్వహిస్తునట్లు . ప్రాంతీయ రవాణాశాఖ అధికారి ఆర్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రవాణాలో ఎల్ఎల్ఆర్ పొందేందుకు ఆటో నాన్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఏడాది పూర్తిచేసుకుని, 20 సంవత్సరాలు వయస్సు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉదయం 10 గంటలకు ఆధార్ కార్డుతో పాటు, లైసెన్స్ ధృవపత్రాలు తీసుకుని హాజరు కావాలని ఆయన తెలిపారు.

యువజనోత్సవాలు వాయిదా

కాకినాడ రూరల్ : ఈనెల 23వ తేదీన జిల్లా యువజన సంక్షేమశాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో కాకినాడ పాత బస్టాండ్ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించే డివిజన్‌స్థాయి యువజనోత్సవం–సాంస్కృతిక పోటీలను మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్లు సెట్రాజ్ సీఈవో పీవీ రమణ తెలిపారు. ఈ పోటీలను తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.

నేడు కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ సమావేశం

కాకినాడ: సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సమావేశం బుధవారం కాకినాడలో జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటకు స్థానిక డి–కన్వెన్షన్ హాలులో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నేత, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులంతా హాజరుకావాలని ఘట్టమనేని కోరారు.

చాత్తాద శ్రీవైష్ణవులకు ద్రావిడ వేదంలో ఉచిత శిక్షణ



శిక్షణలో చాత్తాద శ్రీ వైష్ణవులు, సాంప్రదాయ కార్యదర్శి ప్రసాద్

గండేపల్లి : చాత్తాద శ్రీ వైష్ణవులకు ద్రావిడ వేదంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చాత్తాద శ్రీ వైష్ణవ సంఘ సాంప్రదాయ కార్యదర్శి, జీయ్యన్న మఠాధిపతి వంశీయులు, ప్రధాన అర్చకుడు పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. ద్రావిడ వేదంలో శిక్షణ పొందడం ద్వారా వీరు పూజలు, వివాహాలు, వ్రతాలు చేసేందుకు అర్హులన్నారు. వారంలో ప్రతీ మంగళవారం మండలంలోని తాళ్లూరు జీయ్యన్న ఆలయ మండపంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వీరికి భోజన సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాలయ పరిపాలన సంస్థ ఆధ్వర్యంలో గతంలో శిక్షణ పొంది సర్టిఫికెట్లు తీసుకున్నారన్నారు. రంపయర్రపాలెం, రాజుపూడి, మల్లేపల్లి, ఏలేశ్వరం, రామక్రిష్ణాపురం, చినశంకర్లపూడి, సామర్లకోట, రాజమహేంద్రవరం, తదితర గ్రామాల నుంచి వైష్ణవులు మూడు వారాలుగా శిక్షణ తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. తనతో పాటు, తొండా రాజగోపాలరావు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.లలో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	9,000 – 9,400
కొత్త కొబ్బరి (రెండో రకం)	8,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	10,000
గటగట (వెయ్యి)	6,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	9,000
గటగట (వెయ్యి)	5,500
నీటికాయ	
పాత (ముక్కుడు) కాయ (వెయ్యి)	7,800 – 8,000
కొత్త (పచ్చి) కాయ (వెయ్యి)	8,000 – 8,300
కొబ్బరి నూనె (15 కిలోలు)	2,180
ఒక కిలో	160

తిరుమల సమాచారం



తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ బాగా తగ్గింది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 5 కంపార్టుమెంట్లు మాత్రమే నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం

గదుల వివరాలు: ఉచిత గదులు 3, రూ.50 గదులు 15, రూ.100 గదులు 25, రూ.500 గదులు 10 ఖాళీ ఉన్నాయి.

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ 250 ఖాళీ ఉన్నాయి
వసంతోత్సవం 200 ఖాళీ ఉన్నాయి
ఆర్జిత బ్రహ్మోత్సవం 230 ఖాళీ ఉన్నాయి

బుధవారం ప్రత్యేక సేవ : సహస్రకలశాభిషేకం

ఓం నమో వేంకటేశాయ

ఆక్వా మార్కెట్


వెనామీ ప్రాన్ (కిలో ఒక్కంటికి రూ.ల్లో)

20 కౌంట్	620	46–47 ॥	370
25 ॥	520	50 ॥	360
30 ॥	450	51–60 ॥	330
32 ॥	430	63–70 ॥	310
40 ॥	410	73–80 ॥	290
42 ॥	390	83–90 ॥	270
43–45 ॥	380	93–100 ॥	250

రావులపాలెం అరటి మార్కెట్

రకం (గెల రూ.ల్లో)	కనిష్ట	గరిష్ట
కర్పూర	150	450
చక్కెరకేళీ (తెలుపు)	150	400
బుషావళి	100	300
బొంత (కూర అరటి)	200	300
అమృతపాణి	200	430
చక్కెరకేళీ (ఎరుపు)	300	600

అన్నవరం సమాచారం



అన్నవరం : సత్యదేవుని ఆలయానికి బుధవారం వచ్చే భక్తులకు స్వామి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పడుతుంది. ప్రకాష్‌సదన్ సత్రంలో 50, ఇతర సత్రాల్లో 100 గదులు ఖాళీ ఉన్నాయి. స్వామిని మంగళవారం ఐదు వేల మంది భక్తులు దర్శించుకున్నారు. స్వామివారి వ్రతాలు 504 జరిగాయి. ఆరుగురు భక్తులు సత్యదేవుని నిత్యకల్యాణం టిక్కెట్లు కొనుగోలు చేసి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.42 వేల విరాళాలు వచ్చాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.ఐదు లక్షల ఆదాయం సమకూరింది.

మే హెల్ప్‌యూ ఫోన్ నెంబర్: 08868–239999
రిసప్షన్ ఫోన్ నెంబర్: 08868–238163

బుల్లితెర

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30	నిరీక్షణ
ఉ.07.00	న్యూస్ 360
ఉ.07.30	కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30	ఎలక్షన్ డే
ఉ.09.30	ఎలక్షన్ డే
ఉ.10.00	ఎలక్షన్ డే
ఉ.10.30	ఎలక్షన్ డే
మ.02.30	ఎలక్షన్ డే
సా.04.30	ఎలక్షన్ డే
సా.05.00	స్పీడ్ న్యూస్
సా.05.30	ఉర్దూ న్యూస్
రా.07.30	పొలిటికల్ కారిడార్
రా.08.00	ఫోర్త్ ఎస్టేట్
రా.09.00	న్యూస్ 360
రా.09.30	మ్యాగజీన్ స్టోరీ
రా.10.30	స్క్రీన్‌ప్లే
రా.11.30	న్యూస్ ఫీచర్


టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 అయ్యప్ప దీక్ష
ఉ.09.30 స్నేహగీతం
మ.12.00 రగడ
మ.03.00 నా ఇష్టం
రా.09.00 ఇడియట్



మూవీస్ నౌ
ఉ.06.30 ల్యాండ్ ఆఫ్ ద డెడ్
ఉ.08.20 ద బౌర్న్ అల్టిమేటం
ఉ.10.30 బిగ్ హీరో 6
మ.02.25 యాంట్-మ్యాన్
సా.06.25 సూపర్‌మ్యాన్ 3



హెచ్‌బీవో
ఉ.06.16 ప్యాసింజర్ 57
ఉ.09.25 ఫూల్స్ గోల్డ్
ఉ.11.28 స్టెప్ అప్
సా.06.55 10,000 బి.సి.
రా.09.00 గెట్ స్మార్ట్



స్టార్ గోల్డ్
ఉ.09.30 చాందినీ చౌక్ టు చైనా
మ.12.45 కృష్ణా కాటేజ్
మ.03.30 ప్రేమ్ రతన్ ధన్ పాయో
సా.06.55 సింగం
రా.10.00 విధ్వంసక:ద డిస్ట్రాయర్



మా మూవీస్
ఉ.07.00 మళ్లీ మళ్లీ ఇది రానిరోజు
ఉ.09.00 మాస్
మ.12.00 జోకర్
మ.03.00 అల్లరి బుల్లోడు
సా.05.00 100% లవ్



జీ సినిమా
ఉ.04.45 క్యోం! హో గయా నా
ఉ.07.57 ఫటా పోస్టర్ నిఖ్‌లా హీరో
మ.02.45 ఆర్యా
సా.06.05 మేరా బద్లా: రివెంజ్
రా.09.00 ఇంటర్నేషనల్ రౌడీ

తూర్పుగోదావరి వాతావరణం

గరిష్టం : 34.0° / కనిష్టం : 27.5°

నేడు : తేలికపాటి గాలులతో ఓ మోస్తరు వాన కురవొచ్చు. ఉదయం వేడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమౌతుంది. గరిష్టం : 34డి. కనిష్టం:26 డి.

రేపు : తేలికపాటి గాలులతో ఓ మోస్తరు వాన కురవొచ్చు. ఆకాశం మేఘావృత మౌతుంది. వాతావరణం సౌకర్యంగా ఉంటుంది. గరిష్టం : 32 డి. కనిష్టం : 25 డి.

శుక్రవారం : పలుమార్లు వాన పడొచ్చు. ఆకాశం మేఘావృమౌతుంది. తేలికపాటి గాలులు వీస్తాయి. గరిష్టం : 31 డి. కనిష్టం : 25 డి.

మధురపూడి విమానాశ్రయ సమాచారం



జెట్ ఎయిర్‌వేస్ మొదటి సర్వీసు : హైదరాబాద్ నుంచి ఉదయం 9–20 గంటలకు బయలుదేరి, 10–55కు మధురపూడి వస్తుంది. తిరిగి 11–20 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతుంది.

2వ సర్వీసు : హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 1–10 గంటలకు బయలు దేరి, 2–20 గంటలకు మధురపూడి చేరుతుంది. తిరిగి హైదరాబాద్‌కు 2–40గంటలకు బయలుదేరుతుంది.


విచారణ కౌంటర్ 0883, 2487009

స్పైస్ జెట్ : మొదటిసర్వీసు హైదరాబాద్ నుంచి 10–10 గంటలకు బయలుదేరి, 11–05 గంటలకు మధురపూడి వస్తుంది. తిరిగి హైదరాబాద్‌కు 11–35 గంటలకు పయనమవుతోంది.

2వ సర్వీసు : చెన్నై నుంచి మధ్యాహ్నం 1–10 గంటలకు బయలుదేరి, 2–30 గంటలకు మధురపూడి చేరుతుంది. ఇక్కడి నుంచి 3 గంటలకు బయలుదేరి, 4–15 గంటలకు చెన్నై చేరుతుంది.

విచారణ కౌంటర్ : 0883–2004002

రిపోర్టర్ల ఫోన్ నెంబర్లు : సాక్షి రాజమహేంద్రవరం - కోటి రెడ్డి : 9010840011, రాజమహేంద్రవరం సిటీ - శేఖర్ రెడ్డి : 94915 17813, కంబాలచెరువు - గంగాధర్ : 80999 95559, దేవిచౌక్/కల్చరల్ - సుబ్రహ్మణ్యం : 95055 04768, తాడితోట/క్రైం - సోమరాజు : 92908 70253, ఆల్కాట్‌తోట - విశ్వనాథం : 90107 46673, కోటగుమ్మం - వెంకటరావు : 99890 32426, దానవాయిపేట - దానవాయిబాబు : 93912 05745



రోడ్లు ఛిద్రం...డ్రైనేజీలు అధ్వానం

- రోడ్లు వేసిన ఆరునెలలకే శిథిలం
- డ్రైనేజీల్లో పేరుకుపోతున్న సిల్ట్



శిథిలమైన ఏవీ అప్పారావు రోడ్డు

కోటగుమ్మం : నగరంలో ఏ రోడ్డు చూసినా గోతులే. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిన్నగా ఉన్న గోతులు పెద్దవిగా తయారయ్యాయి. నగరపాలక సంస్థ సుమారు 7 నెలల క్రితం నిర్మించిన ఏవీ అప్పారావు రోడ్డు, జేఎన్ రోడ్డు, తాడితోట, సుబ్బారావు పేట తదితర ప్రాంతాల్లోని రోడ్లు ప్రస్తుతం నరకాన్ని తలపిస్తున్నాయి. రోడ్లు మొత్తం ఛిద్రంగా మారిపోయాయి. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

దుమ్ము లేస్తోంది

గోతుల మాట ఎలా ఉన్నా... ఆ గోతుల్లోంచి లేచిన కంకర దుమ్ముగా మారి ప్రజలకు చాలా ఆటంకంగా మారింది. అంతే కాకుండా వర్షం కురిసే సమయంలో బురదగా మారి వాహన చోదకులు, బాటసారులకు అసహనం కలిగిస్తోంది. రాత్రి సమయాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగక పోవడంతో గొయ్యి ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. కాగా ఏవీ అప్పారావు రోడ్డులో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ రోడ్డులో పెట్రోల్ బంక్ దగ్గర నుంచి గెయిల్ కార్యాలయం వరకూ ప్రజలకు నరకం కనిపిస్తోంది. పూర్తిగా శిథిలమైన ఈ రోడ్డులో అడుగుకో గొయ్యి అన్నట్టు ఉంది.

అస్తవ్యస్తంగా డ్రైనేజీలు

ఏవీ అప్పారావు రోడ్డు, జేఎన్ రోడ్డుకు ఉన్న పది లింకు రోడ్లల్లోని డ్రైనేజీలు చాలా వరకు శిథిలమయ్యాయి. ఆ శిథిలాలు డ్రైనేజీలో పడి మురుగునీరు పారేందుకు ఆటంకంగా ఉంది. స్థానికులు వేసే వ్యర్థాలు కూడా చేరి మురుగునీరు రోడ్డుపై ప్రవహించే పరిస్థితి ఏర్పడింది.



నగరంలోని ఒక డ్రైనేజీ పరిస్థితి

చిట్టి చేతుల్లో మట్టి వినాయకుడు



వినాయకుడి మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న శ్రీషిర్డీ సాయి విద్యానికేతన్ విద్యార్థులు

కంబాలచెరువు : పర్యావరణ పరిరక్షణకు కలసికట్టుగా కృషి చేయాలని శ్రీషిర్డీసాయి విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆల్‌బ్యాంక్ కాలనీలోని శ్రీషిర్డీసాయి విద్యానికేతన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీ మంగళవారం ప్రారంభమైంది. దీనిలో భాగంగా విద్యార్థులు 3 వేల మట్టి వినాయక విగ్రహాలను తయారీ చేసి పంపిణీ చేశారు. ఆ స్కూలు చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ రసాయనాలతో తయారుచేసే విగ్రహాలు వాడడం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే వినియోగించాలి

కోటగుమ్మం : వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన విగ్రహాలనే వినియోగించాలని రాజమహేంద్రవరం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వి.విజయరామరాజు ప్రకటనలో సూచించారు. చవితి పందిళ్లను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రోడ్డుకు పక్కగా ఏర్పాటు చేయాలన్నారు. కాలుష్యానికి కారణమైన ప్రతి దాన్ని దూరంగా ఉంచాలన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

దేవీచౌక్ : మతపరమైన ముస్లిం పర్సనల్ లా విషయంలో తాము జోక్యం చేసుకోబోమని ట్రిపుల్ తలాక్ విషయంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై రాయల్ మసీదు అధ్యక్షుడు అసదుల్లా అహమ్మద్ హర్షం వ్యక్తం చేశారు. ముస్లింలకు సంబంధించిన అంశాలపై చట్టాలు చేసేముందు ముస్లిం పెద్దల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఏకపక్ష నిర్ణయాలు తగవని ఆయన హితవు పలికారు.

రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్

తాడితోట : ప్రధాన రైల్వేస్టేషన్ మాస్టర్ ప్రభాకరరావు, చీఫ్ టికెట్ రైల్వే మేనేజర్ కేశవభట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన పక్షోత్సవాల్లో భాగంగా స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని పిచ్చిమొక్కలను పీకి శుభ్రం చేశారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

'అటా' పురస్కారానికి ఉపాధ్యాయులు



నారాయణమూర్తి



కృష్ణమోహన్

కంబాలచెరువు : అవార్డు టీచర్స్ అసోసియేషన్ (అటా) జాతీయ పురస్కారానికి రాజమహేంద్రవరానికి చెందిన ఉపాధ్యాయులు ఈమని సత్యనారాయణమూర్తి, వరహాగిరి కృష్ణమోహన్ ఎంపికయ్యారు. ఆ వివరాలను అటా జాతీయ అధ్యక్షుడు బెక్కంటి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఆర్‌సీఎం స్కూల్లో తెలుగు పండిట్‌గా 37 ఏళ్లుగా పనిచేస్తున్న సత్యనారాయణమూర్తి తెలుగుబాషా బోధనలో అందించిన విశిష్ట సేవలకు ఈ పురస్కారం లభించింది. అలాగే నివేదిత కిశోర్ విహార్ స్కూలులో 20 ఏళ్లుగా స్కౌట్ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న కృష్ణమోహన్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. అటా అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులను విద్యాశాఖాధికారులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

క్రైం కార్నర్

మోటారు సైకిల్ ఢీ కొని వ్యక్తికి గాయాలు

రాజమహేంద్రవరం క్రైం : మోటారు సైకిల్ ఢీ కొన్న సంఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. సీతంపేటకు చెందిన దాసరి వీరవెంకటప్రసాద్ మంగళవారం రామకృష్ణ థియేటర్ వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తపేట వద్ద మోటారు సైకిల్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వెంకటప్రసాద్ తీవ్ర గాయాలు పాలయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

ఇల్లు ఖాళీ చేసే విషయంలో తలెత్తిన వివాదంలో ఇంటి యజమాని, అద్దెకు ఉంటున్న వారు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. తుమ్మలావకు చెందిన పొన్నాడ లలిత, ఆమె భర్త నాగరాజు ఇంట్లో కొంతకాలంగా కుంచే హనుమంతరావు, ఆయన భార్య కుమారి అద్దెకు ఉంటున్నారు. ఇల్లు ఖాళీ చేసే విషయంలో ఇరువర్గాలకు విభేదాలు వచ్చాయి. వారి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేశారు.

గోదావరిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

గుర్తు తెలియని వ్యక్తి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గోకవరానికి చెందిన ఒక వ్యక్తి మంగళవారం సాయంత్రం రోడ్డు కమ్ రైల్వే బ్రిడ్జి పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు అతడితో ఉన్న మరో వ్యక్తి ఫిర్యాదు చేశారు. అయితే గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వివరాలు పోలీసులకు తెలియరాలేదు. ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

మరిన్ని జోన్ వార్తలు 12లో...

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో నేతల ప్రచారం

తాడితోట : కాకినాడలో జరుగుతున్న కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా 4 వ డివిజన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని పలక సూర్య కుమారికి మద్దతుగా తుని శాసన సభ్యుడు దాడిశెట్టి రాజా, రాజమహేంద్రవరం కార్పొరేషన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మేడపాటి షర్మిలా రెడ్డి, మైనార్టీ నాయకుడు మహ్మద్ ఆరీఫ్ తదితరులు ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ ప్రచారం చేశారు. అలాగే 23వ డివిజన్ అగ్రహారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మీసాల శ్రీదేవికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ కన్వీనర్ రౌతు సూర్య ప్రకాశరావు, మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గ్రేటర్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు కందుల దుర్గేష్ ప్రచారం చేశారు. వార్డులో ప్రతీ ఒక్కరిని పలకరిస్తూ చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి దంగేటి వీరబాబు, మాజీ ఫ్లోర్ లీడర్ పోలు విజయలక్ష్మి, గుదే రఘు నరేష్, పోలు కిరణ్ మోహన్ రెడ్డి, తామాడ మోషేలా, అడపా హరి, నీలం గణపతి, రాఘవ రెడ్డి, ఉప్పాడ కోట రెడ్డి, సూరవరపు సూరిబాబు, కుక్కల తాతబ్బాయి, భాస్కరరావు, విప్పర్తి ఫణికుమార్, కర్రినాయుడు, యర్ల మహేష్, చిక్కాల బాబులు, కె.గాంధీ, అడబాల శ్రీనివాస్, చీకిరిమిల్లి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

శ్రమను మరిపించేది జానపద సాహిత్యమే



సూర్య ప్రభావతిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

రాజమహేంద్రవరం కల్చరల్ : శ్రమజీవుల అలసటను తొలగించే శక్తి జానపద సాహిత్యానికి ఉందని జానపద వాఙ్మయోద్ధారక నేదునూరి గంగాధరం తనయ నేదునూరి సూర్యప్రభావతి అన్నారు. మంగళవారం కందుకూరి రాజ్యలక్ష్మి డీఎడ్ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ జానపద దినోత్సవంలో సూర్యప్రభావతి తన తండ్రి నేదునూరి గంగాధరం జానపద సాహిత్యానికి చేసిన కృషిని వివరించారు. ప్రయాణ సౌకర్యాలు లేని రోజుల్లో, నేదునూరి గ్రామాలు తిరిగి విలువైన జానపద సాహిత్యాన్ని సేకరించారన్నారు. గ్రామాలలోని బడిలోనో, గుడిలోనో బస చేసేవారన్నారు. తాగి వచ్చి భార్యను దుర్భాషలాడే భర్తలు ఉపయోగించే బూతు సామెతలను కూడా చాటుగా ఉండి సేకరించేవారన్నారు. కన్ను తెరచినప్పటి నుంచి కాటి క్లేవరకు మన జీవితాల్లో జానపద సాహిత్యం పరుచుకుని ఉందన్నారు. ఎస్‌కేవీటీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ జానపద సాహిత్యం లేకపోతే మానవ వికాసమే లేదన్నారు. నేదునూరి గంగాధరం జయంతిని జానపద దినోత్సవంగా ప్రకటించాలని ఆయన కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమాదేవి మాట్లాడుతూ జానపద సాహిత్యం అతి ప్రాచీనమైనదని అన్నారు. వీటీ కళాశాల అధ్యాపకుడు పి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ మన జీవితాల్లో పనీ-పాటా కలిసి పోవడానికి జానపద సాహిత్యమే కారణమన్నారు. నేదునూరి గంగాధరం తనయ సూర్యప్రభావతిని నిర్వాహకులు సత్కరించారు. కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అడ్డతీగలలోని
సాంఘిక సంక్షేమ శాఖ బాలురు వసతిగృహం

సం క్షేమం క్షోభం

- గురుకుల విద్య పేరిట సాంఘిక సంక్షేమ వసతి గృహాల మూత
- తాజాగా జిల్లాలో 18 హాస్టళ్లు ఎత్తివేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
- ఆందోళనలో విద్యార్థులు..

అడ్డతీగల (రంపచోడవరం): గురుకుల విద్య అందుబాటులోకి తీసుకొస్తున్నామనే సాకుతో సాంఘిక సంక్షేమ శాఖ అజమాయిషీలోని వసతి గృహాలను ఒక్కొక్కటిగా ఎత్తివేస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వసతి గృహాలను నిర్వహిస్తోంది. ఇక్కడ విద్యార్థులు భోజనం చేసి, దగ్గరలోని పాఠశాలల్లో చదువుకుంటారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇక్కడి విద్యార్థులను జిల్లాలోని వివిధ చోట్ల ఉన్న గురుకుల పాఠశాల్లో చేర్పిస్తున్నారు. ఈ నిర్ణయం అనుసరించి 2015–2016 విద్యా సంవత్సరంలో 22, 2016–2017లో 11 వసతి గృహాలు మూసివేశారు. తాజాగా జిల్లా వ్యాప్తంగా 18 వసతి గృహాలు ఎత్తివేసి అక్కడి విద్యార్థులను సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఉత్తర్వులు జారీచేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్, అమరావతి ఉత్తర్వుల ఆధారంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆ ఉత్తర్వులు అందుకున్న వసతి గృహాల సంక్షేమాధికారులు అందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ చెబుతున్నట్టు వసతి గృహాలను గురుకుల పాఠశాలలుగా మార్పు చేస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొంటున్నప్పటికీ.. ఏఏ వసతి గృహాల విద్యార్థులను ఏఏ గురుకుల పాఠశాలల్లో చేర్పించాలో నిర్దేశించడం గమనార్హం.

సంక్షేమాధికారులకు ఆదేశాలు..

జిల్లాలోని తొండంగి, హంసవరం, పెద్దాపురం, ఏలేశ్వరం, అడ్డతీగల, రామచంద్రపురం–3, అనపర్తి, మండపేట, రామచంద్రపురం–2, ముమ్మిడివరం, కొత్తపేట, కాకినాడ, వేలంగి, పిఠాపురం, రంపచోడవరం, రాజానగరం, ముక్తేశ్వరం, అమలాపురం తదితర చోట్ల ఉన్న బాలుర వసతి గృహాల్లోని విద్యార్థులను సూచించిన పాఠశాలల్లో చేర్పించాలని వసతి గృహాల సంక్షేమాధికారులకు ఆదేశాలు అందాయి. అడ్డతీగలలో దాదాపుగా 25 ఏళ్ల కిందట సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు (బాలికలు, బాలురు) ఏర్పాటు చేశారు. 2015లో బాలికల వసతి గృహాన్ని మూసేశారు. తాజాగా బాలుర వసతి గృహాన్ని ఎత్తివేసి ఆ విద్యార్థులను అడ్డతీగలలో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వసతి గృహంలో మూడు నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న 28 మంది ఎస్టీ, 7 గురు ఎస్సీ, 10 మంది బీసీ, 8 మంది ఓసీ విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ వసతి గృహాన్ని ఎత్తివేశారన్న వార్త విద్యార్థులను కలచి వేసింది.

నిబంధనలు ఒప్పుకుంటాయా?

ఐటీడీఏ నిర్దేశిత విధి విధానాల ప్రకారం ఎస్టీ విద్యార్థులకు ఎక్కువ శాతం సీట్లు ఆశ్రమ పాఠశాలల్లో కేటాయిస్తారు. మరి మిగతా కులాలకు చెందిన విద్యార్థులకు ఇక్కడ ప్రవేశానికి నిబంధనలు ఒప్పుకుంటాయా.? ఉన్నతాధికారులే ఆ వెసులుబాటుకు సంబంధించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మిగతా చోట్ల ఇదే పరిస్థితి నెలకొనడంతో ఇక్కడ వసతి పొందుతున్న విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.కాగా..గతంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని చెప్పా పెట్టకుండా మూసివేయడం, తాజాగా బాలుర వసతి గృహాన్ని ఎత్తివేయాలని ఉత్తర్వులు జారీ కావడంతో స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేస్తూ.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు నిర్ణయించారు.


ORDER:

ఈ నెల 5న కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీ

ఆదిత్య విద్యార్థికి బంగారు పతకం

గండేపల్లి(జగ్గంపేట): సూరంపాలెం ఆదిత్య కళాశాలలకు చెందిన విద్యార్థికి బంగారు పతకం లభించినట్టు చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బి.టెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఎం.పునీత్‌కుమార్ విజయవాడలో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో 91 కిలోల విభాగంలో ఈ పతకం సాధించాడు. ఈ సందర్భంగా పునీత్ కుమార్‌ను ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరెడ్డి, వి. శ్రీనివాసరావు, ఎస్.రమాశ్రీ, మురళీమోహన్, తదితరులు అభినందించారు.



పునీత్ కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

స్కేటింగ్‌లో గైట్ విద్యార్థి ప్రతిభ

రాజానగరం: రోలర్ రిలే స్కేటింగ్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల గోవాలో జరిగిన ఓపెన్ స్కేటింగ్ పోటీల్లో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల విద్యార్థి ఎం.కేశవకృష్ణ ప్రతిభ చూపాడు. నాలుగు విభాగాల్లోనూ స్వర్ణ పతకాలు సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ధనరాజ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో మలేషియాలో జరిగే ప్రపంచ పోటీల్లో పాల్గొనేందుకు కేశవ కృష్ణ అర్హత సాధించాడన్నారు. ఈ సందర్భంగా విజేతను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామచంద్రన్, అధ్యాపకులు సుమలత, స్పోర్ట్స్ ఇన్‌చార్జి షేక్ మీరా, తదితరులు అభినందించారు.



కేశవకృష్ణను అభినందిస్తున్న యాజమాన్యం

కరాటేలో ‘పవర్ కిక్’ విద్యార్థుల ఘనత

ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానం కైవసం

అమలాపురం: విశాఖపట్నంలో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగిన షోటోకాన్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన స్టేట్ కరాటే చాంపియన్ షిప్‌లో అమలాపురంలోని పవర్ కిక్ కరాటే స్కూలు విద్యార్థులు ప్రతిభ చూపారు. కాటాస్ విభాగంలో డి.వైష్ణవి, కె.సాత్విక్, కె.గౌతమ్ స్వర్ణ పతకాలు సాధించగా, కుమిటి విభాగంలో వి.ప్రభాత్, పి.యజ్విన్, సీహెచ్ ధనుష్ రజత పతకాలు, పి.ధన్విన్ కాంస్య పతకం కైవసం చేసుకున్నట్టు చీఫ్ కోచ్ పడాల అంజి, కోచ్ చిక్కం సురేష్ చెప్పారు. ఈ పోటీల్లో తొమ్మిది జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు తలపడ్డారన్నారు. ఓవరాల్ చాంపియన్ షిప్ విభాగంలో అమలాపురం జట్టు రెండో స్థానంలో నిలిచిందని, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా చాంపియన్ షిప్ ట్రోఫీని అందుకున్నారని తెలిపారు. పోటీల్లో కె.గౌతమ్ బ్లాక్ బెల్ట్ సాధించాడన్నారు. విజేతలను గ్రాండ్ మాస్టర్ హైదర్ అలీ, జిల్లా ఒలింపిక్ అధ్యక్షుడు డాక్టర్ మెట్ల సూర్యనారాయణ, తదితరులు అభినందించారు.



పతకాలతో పవర్ కిక్ కరాటే స్కూలు విద్యార్థులు, చీఫ్ కోచ్, కోచ్

‘నాన్న కావాలి’ కవితకు సాహిత్య పురస్కారం

రాజమహేంద్రవరం కల్చరల్: ఖమ్మం జిల్లా కొత్తగూడేనికి చెందిన అధ్యాపకురాలు ఎస్.సుమిత్రాదేవి రాసిన ‘నాన్న కావాలి’ దీర్ఘ కవిత.. గూటం తాతారావు విశిష్ట సాహిత్య పురస్కారానికి ఎంపికై ంది. గూటం తాతారావు కళావేదిక అధ్యక్షుడు గూటం స్వామి మంగళవారం ఈ విషయాన్ని ప్రకటించారు. సెప్టెంబర్ ఒకటో తేదీన జరిగే కార్యక్రమంలో సుమిత్రా దేవిని జ్ఞాపిక, శాలువా, నగదు పురస్కారాలతో సత్కరిస్తామన్నారు. అవార్డు కమిటీ సభ్యులుగా జి.సుబ్బారావు, ఫణి నాగేశ్వరరావు, ఎస్.ఆర్.పృథ్వీలు వ్యవహరించారని ఆయన పేర్కొన్నారు.



రచయిత్రి సుమిత్రాదేవి

ఎస్సీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఎస్‌ఏజీ ట్రైనింగ్ అకాడమీ కార్యదర్శి కేబీకే

అమలాపురం టౌన్: జిల్లాలో 18 నుంచి 30 ఏళ్ల వయసున్న ఎస్సీ నిరుద్యోగ యువతకు 45 రోజుల పాటు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ ఎస్‌ఏజీ ట్రైనింగ్ అకాడమీ కార్యదర్శి కాట్రు బాలకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. అమలాపురంలోని మిరియాం కళాశాలలో పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన ఎస్సీ నిరుద్యోగులకు వెబ్ డిజైనింగ్, డీటీపీ, ట్యాలీ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పరీక్ష నిర్వహిస్తుందని తెలిపారు. ఇందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నెలకు రూ.7 వేల నుంచి రూ.12వేల వరకు జీతం ఇచ్చే ఉపాధి అవకాశాలు ఉంటాయని కేబీకే తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ రేషన్, ఆధార్, విద్యార్హత, కుల ధ్రువీకరణ జెరాక్స్ కాపీలు, 6 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 30వ తేదీలోపు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో గానీ.. మిరియాం బీఈడీ కళాశాల క్యాంపస్‌లోని ఎస్‌ఏజీ ట్రైనింగ్ అకాడమీలో సంప్రదించాలని సూచించారు. శిక్షణ సమయంలో వసతి, భోజన సదుపాయం ఉంటుందని వివరించారు. అభ్యర్థులు కోరుకున్న కోర్సుతో పాటుగా కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా నేర్పిస్తామని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో శిక్షణ ప్రారంభమవుతుందని, మరిన్ని వివరాలకు 99663 41234 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే నరసయ్య

మార్పు కోసం ఉద్యమించండి

- విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే నరసయ్య సూచన
- రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభం

అమలాపురం రూరల్: నేటి దోపిడీ వ్యవస్థ మార్పు కోసం విద్యార్థులు సంఘటితంగా ఉద్యమించాలని ఖమ్మం జిల్లా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నరసయ్య పిలుపునిచ్చారు. అమలాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. సమాజంలో ధనిక పేద తారతమ్యాలు మరింత పెరిగాయని, విద్యను కొనుక్కునే దుస్థితి ఏర్పడందని ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రవిచంద్ర మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో విద్యారంగాన్ని రెండు ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంలు చంద్రబాబు, కేసీఆర్‌లు కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహనరావు మాట్లాడిన ఈ కార్యక్రమంలో తొలుత పీడీఎస్‌యూ పతకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థి అమర వీరులకు సంతాపం తెలిపారు. అనంతరం ప్రారంభమైన శిక్షణ తరగతుల్లో పలు అంశాలపై నిపుణులు ఉపన్యాసించారు. జీవ పరిణామ వాదంపై పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి వివరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ జిల్లా కార్యదర్శి డి.దుర్గాప్రసాద్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, కె.నరేషాచారి, శ్రీదేవి ప్రసంగించారు.

అమరావతి పేరుతో చంద్రబాబు బూటకం

నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పేరుతో చంద్రబాబు రైతుల భూములను బలవంతంగా లాక్కొని బూటకపాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆరోపించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ హరితహారం పేరుతో అడవి భూములను గిరిజనుల నుంచి లాగేసుకుంటుంటే... ఆంధ్రలో చంద్రబాబు రైతుల భూములను కొల్లగొడుతున్నారన్నారు. రెండు రాష్ట్రాల్లో రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. ఆదివాసీ చట్టాలనూ కాలరాస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులిస్తున్నా.. నిర్వాసితులకు మాత్రం పరిహారం చెల్లించడం లేదన్నారు.

16 నుంచి రైతు ఉద్యమ యాత్ర

దేశంలోని 13 రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతు ఉద్యమయాత్ర సెప్టెంబర్ 16న ఉభయ రాష్ట్రాల్లో ప్రారంభమవుతుందని సీపీఎం న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు, గిట్టుబాటు ధర తదితర డిమాండ్లతో ఈ యాత్ర సాగుతుందన్నారు.

పాదయాత్రకు మరోసారి

ఆటంకం


కిర్లంపూడిలో తన నివాసంలో గేటు వద్ద అడ్డుకున్న పోలీసులతో మాట్లాడుతున్న ముద్రగడ, జేఏసీ నాయకులు

- అడ్డుకుంటున్న పోలీసు యంత్రాంగం
- ముద్రగడకు మద్దతుగా కిర్లంపూడికి పోటెత్తుతున్న అభిమానులు
- భారీగా తరలివస్తున్న కాపు మహిళలు
- వివిధ ప్రాంతాల నుంచి వచ్చి, చంద్రబాబుకు వ్యతిరేకంగా నిరసనలు

జగ్గంపేట : కాపు రిజర్వేషన్ల కోసం ముద్రగడ పద్మనాభం చేపడుతున్న పాదయాత్రకు పోలీసులు ఇప్పట్లో అనుమతి ఇచ్చేలా లేరు. అనుమతి పేరుతో ఇంటి గేటు వద్దే ఆయనను గత నెల నుంచి అడ్డగించి వెనక్కి పంపుతున్నారు. దీంతో ఐదు రోజులు పాటు గేటు వద్ద శిబిరంలో బైఠాయించి నిరసన తెలియజేసిన ఆయన మంగళవారం మరో సారి తన అనుచరులతో యాత్రకు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. మరో వైపు ప్రభుత్వానికి నిరసనలు తెలియజేసేందుకు ముద్రగడ స్వగ్రామం కిర్లంపూడికి కాపులు, అభిమానులు భారీగా తరలివస్తున్నారు. చలో కిర్లంపూడి పిలుపుతో రోజురోజుకూ ఆయనకు మద్దతుగా అన్ని వర్గాల ప్రజలు వస్తున్నారు. ముఖ్యంగా కాపు మహిళల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. మంగళవారం ఇంటి నుంచి బయటకు పాదయాత్రగా వచ్చిన ముద్రగడను గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో గేటు వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన అనుచరులతో బైఠాయించి నిరసనలు తెలియజేశారు. ముద్రగడకు మద్దతుగా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన మహిళలు భారీగా తరలివచ్చి కిర్లంపూడి మెయిన్ రోడ్డుపై కూర్చుని ధర్నా చేసి, కాపు రిజర్వేషన్లు ఇవ్వాలని, జై ముద్రగడ అని నినాదాలు చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం గిడజం గ్రామానికి చెందిన కాపులు కూరగాయల వెంకటరమణ ఆధ్వర్యంలో కిర్లంపూడి మెయిన్ రోడ్డుపై మోకాళ్లపై నిలబడి సుమారు గంట పాటు నిరసన తెలియజేశారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో కాపు నాయకులు గొల్లపల్లి కాశీ విశ్వనాథ్ కొద్దిసేపు పోలీసులతో వాగ్వాదం చేశారు. కాకి సత్యనారాయణ, వీరబాబు, తూటయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు మండలం ఏలూరుకు చెందిన కాపులు బైక్ ర్యాలీగా తరలివచ్చి ముద్రగడకు మద్దతు తెలిపారు. అలాగే కిర్లంపూడికి చెందిన బ్రహ్మణ సంఘ పెద్దలు మద్దతు తెలియజేశారు.


ముద్రగడకు మద్దతుగా తరలివస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు


కిర్లంపూడిలో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న రౌతులపూడి మండలం గిడజం గ్రామ కాపులు


ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామ కాపుల బైక్ ర్యాలీ

సొమ్ములొచ్చాకే విశ్రమిస్తాం

- అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల
- జిల్లాలోకి ప్రవేశించిన చైతన్య యాత్ర

తుని రూరల్ : అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్ చేసిన బాధితులకు వడ్డీతో సహా సొమ్ములు ఇప్పించేంత వరకు విశ్రమించేది లేదని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు ఈనెల 16 నుంచి సెప్టెంబరు 18వరకు చేస్తున్న రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్ర జిల్లాలో ప్రవేశించింది. సోమవారం రాత్రి విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట చేరుకుని అక్కడ బస చేసిన యాత్ర బృందం మంగళవారం ఉదయం తుని గొల్ల అప్పారావు సెంటర్ నుంచి జిల్లాలో యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా సెంటర్లో బాధితులను, ఏజెంట్లను ఉద్దేశించి మాట్లాడారు. బాధితుల డబ్బును రాబట్టేందుకు రెండున్నరేళ్లగా అనేక రూపాల్లో ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. బాధితులంతా ఐక్యంగా పోరాడితేనే సొమ్ములు రాబట్టుకోగలమన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 142 మంది అగ్రి గోల్డ్ బాధితులు మృతి చెందారన్నారు. బాధితులు ఎవరూ ఆత్మహత్యకు పాల్పడవద్దని కోరారు. ఇప్పటి వరకు మూడు జిల్లాల్లో యాత్ర పూర్తయ్యిందని, తూర్పు గోదావరి జిల్లాలో 22, 23తేదీల్లో యాత్ర కొనసాగించి బాధితుల్లో చైతన్యం తీసుకువచ్చి, అనంతపురంలో వచ్చేనెల 18న యాత్ర పూర్తి చేస్తామన్నారు. ఈ లోపు ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే మంత్రులను, ఎమ్మెల్యేలను దిగ్బంధిస్తామన్నారు. అవసరమైతే జాతీయ రహదారులను బంద్ చేస్తామన్నారు. గత మార్చిలో చేపట్టిన నిరాహార దీక్షల ఫలితంగా నాలుగు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరిస్తామని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి, ఇప్పటి వరకు న్యాయం చేయలేదన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.విశ్వనాథరెడ్డి, కార్యదర్శి వి.తిరుపతిరావు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యక్షుడు ఎం.జయసింహ, ప్రజా నాట్యమండలి కార్యదర్శి చంద్రనాయక్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి అంబటి రామకృష్ణ, తుని బ్రాంచి అధ్యక్షుడు జి.కృష్ణప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎంవీవీ సత్యనారాయణ, కార్యదర్శి వై.ప్రసాద్ కుమార్, మహిళా కార్యదర్శి వి.రమణమ్మ, ప్రచార కార్యదర్శి కె.నూకరాజు పాల్గొన్నారు.


జిల్లాలో తుని నుంచి ప్రారంభించిన అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

పిఠాపురం టౌన్: ఆత్మహత్యలకు పాల్పడిన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా తక్షణం అందచేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర సమితి నాయకులు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు మనోధైర్యం కల్పించేందుకు నిర్వహిస్తున్న బస్సుయాత్ర మంగళవారం పిఠాపురం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఉప్పాడ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. డిపాజిట్ దారులు, ఏజెంట్ల పోరాట ఫలితంగా నాలుగు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని, మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.5లక్షలు ఎక్స్‌గేషియా నాలుగు నెలల్లో యిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ యిచ్చారని నాలుగు నెలలు గడిచిపోయిన చంద్రబాబు యిచ్చిన హామీని అమలు చేయడం లేదని అన్నారు. ఈ 4 నెలల్లో 35 మంది బాధితులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు బి.విశ్వనాథరెడ్డి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖరరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు జయసింహ, జిల్లా కార్యదర్శి అంబటి రామకృష్ణ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, ఉపాధ్యక్షురాలు బి.లోవరత్నం పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తులు కొనుగోలు చేసి సొమ్ము పంచాలి

కాకినాడ సిటీ : అగ్రిగోల్డ్ ఆస్తులు ప్రభుత్వమే కొని బాధితులకు చెల్లించాల్సిన రూ.నాలుగువేల కోట్లు తక్షణం చెల్లించాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం రాత్రి కాకినాడ చేరకున్న ఆయన ఇక్కడి సభలో మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేస్తామని మాట తప్పిన రాష్ట్ర మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షులు బి.విశ్వనాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అర్చక సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆగమ పరిరక్షణ..వేద విద్యావ్యాప్తికి కృషి
- ఘనంగా ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ సంఘ సమావేశం


సభలో మాట్లాడుతున్న మంత్రి మాణిక్యాలరావు

పెదపూడి (అనపర్తి) : అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పి.మాణిక్యాలరావు అన్నారు. పెదపూడి మండలంలోని జి.మామిడాడలోని ఫ్యామిలీ హెల్త్ క్లబ్‌లో ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ సంఘ ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాక్రాంతమైన ఈనాం భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేద విద్యను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల ఆగమ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర రహదారుల శాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ భగవంతుడి సేవకు అంకితమైన అర్చకులు క్షేమంగా ఉన్నప్పుడే రాష్ట్రం బాగుంటుందన్నారు. ముందుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్య సీతారామశర్మ (మురముళ్ళ రాంబాబు) అధ్యక్షతన శివారాధన, గురు మండలార్చన, శాంతి హోమం నిర్వహించారు. సీతారామశర్మ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా దేవాదాయశాఖలో ఉద్యోగులతో సమానంగా అర్చకుల జీతాలు పెరగడం లేదన్నారు. ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ప్రస్తుతం రూ.250 కోట్లు వరకూ కేటాయించిందని, ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగా రూ.500 కోట్లు మంజూరు చేసేలా కృషి చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ అనపర్తి నియోజకవర్గం కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణులు సుభిక్షంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, వారిని ఆదుకోకపోతే భవిష్యత్తులో అర్చకులు ఉండరన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడు సీతారామశర్మ, కార్యవర్గం పలు తీర్మానాలు చేశారు. ఆలయ అర్చకులకు కార్యనిర్వహణాధికారితో సమానంగా వేత నం అందించాలన్నారు. ఆలయాల్లో అర్చకులకు బయోమెట్రిక్ విధానం అమలు సరికాదన్నారు. రాష్ట్రంలో 22 వేలకు పైగా దేవాలయాల్లో అర్చకుల స్థితిగతులు మెరుగుపరిచే క్రమంలో ప్రభుత్వ విధానం సంతృప్తికరంగా లేదన్నారు. దీనికి సంబంధించిన పలు వినతులతో కూడిన పత్రాన్ని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు అందించారు. ముందుగా సంఘం గౌరవ అధ్యక్షుడు కొల్లిపర సుబ్బారావు, యలమంచిలి కృష్ణమూర్తి, రాంబాబు, వ్యాపారవేత్త ద్వారంపూడి వెంకటరెడ్డి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. రాష్ట్ర నాయకులు, అర్చకులు శ్రీకంఠం నందీశ్వరుడు, కొమాళ్లపల్లి పురుషోత్తమ శర్మ, వెలవెలపల్లి సీతారామశాస్త్రి , మొవ్వా సుబ్బారావు, కాళ్ళకూరి దుర్గాప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ దువ్వూరి సురేష్, రాష్ట్ర కోఆర్డినేటర్ ఈమని సూర్యనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ రాణి శ్రీనివాస్, గూడూరి హనుమంతరావు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ అంగర వంశీకృష్ణ, ఆదిశైవ సంఘం జిల్లా అధ్యక్షుడు కనక దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ' లక్ష్యాలు సాధించాలి

రాష్ట్ర భూపరిపాలనా ముఖ్య కమిషనర్ వీడియోకాన్ఫరెన్స్


రాష్ట్ర భూపరిపాలనా ముఖ్య కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫెరెన్స్‌లో పాల్గొన్న జేసీ మల్లికార్జున, ఇతర అధికారులు

కాకినాడ సిటీ : మీసేవ దరఖాస్తుల పరిష్కారం, నీటి తీరువా, వన్‌టైం కన్వర్షన్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ అనిల్ చంద్రపునేఠా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్లతో వివిధ రెవెన్యూ అంశాల పురోగతి, లక్ష్యసాధనపై వీడియోకాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు రుణ అర్హత కార్డుల జారీ, విద్యార్థులకు ధ్రువపత్రాలజారీ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖల రికార్డుల ఇంటిగ్రేషన్, అప్‌డేషన్, ఈక్రాప్ బుకింగ్, ఎఫ్‌ఎంబీ డిజిటలైజేషన్, ఆక్రమణల రెగ్యులరైజేషన్ వంటి వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతికి సంబంధించిన విషయాలపై జేసీ ఏ.మల్లికార్జున వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ నందిని సలారియా, డీఆర్ఓ ఎం.జితేంద్ర, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ ఏడీ నూతన్‌కుమార్ పాల్గొన్నారు.



పాఠ్య శిల్పులు

- ఆదర్శంగా మన ఉపాధ్యాయులు
- పుస్తకాల రూపకల్పనలో ఘనాపాఠీలు



అంగర గోపాలకృష్ణమాచార్యులు



చిలుకూరి శ్రీనివాసరావు



కత్తుల వెంకటేశ్వరరావు



షేక్ బ్రహ్మాజీషా



తోటకూర సాయిరామకృష్ణ

రాయవరం (మండపేట):

మనం ఎన్నో పుస్తకాలను చదువుతాం. కానీ ఆ పుస్తకాలను రాసిందెవరో పెద్దగా పట్టించుకోం. కానీ మన ముందర నిత్యం కనిపించే పుస్తకాలను రాసిన వారు మనకు తెలిసిన వారే అయితే! మనకు గర్వ కారణం కదూ. రేపటి పౌరుల కోసం రూపొందించిన పుస్తకాలను రాసిన వారిలో మన జిల్లా ఉపాధ్యాయులు, పాఠ్య పుస్తక రచనలో వారి కృషిపై ఈ కథనం.

తెలుగు వెలుగులు..

2,3,4,5 తరగతి తెలుగు వాచకం తయారీలో ముగ్గురు ఉపాధ్యాయులు మన జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఒకరు పెదపూడి మండలం కుమారప్రియం ఎంపీపీపీ పాఠశాలకు చెందిన అంగర గోపాలకృష్ణమాచార్యులు. ఈయన చందమామ రావే, సరదా సరదా పదాలు, సరదా సరదా వేషాలు, విద్యా కిరణాలు, పిల్లల ప్రపంచంలో కథలు రాశారు.

ఎస్ఎస్ఏ, ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించే మాడ్యూల్స్ రూపకల్పనలో కూడా పాల్గొన్నారు.

కడియం మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలకు చెందిన చిలుకూరి శ్రీనివాసరావు తెలుగు, పరిసరాల విజ్ఞానం పాఠ్య పుస్తక రచనలో పాల్గొన్నారు. శ్రీనివాస రావు పంపిన వ్యాసాలు, ఎస్ఎస్ఏ ప్రచురించిన మాసపత్రిక చందమామ రావే, విద్యాగౌతమిలో చేసిన రచనలకు అవకాశం దక్కింది. మూడో తరగతిలో పరిసరాల విజ్ఞానం పాఠ్య పుస్తకంలో ఇంటి పేర్లు ఎలా వస్తాయి, నాలుగో తరగతిలో మన చుట్టూ ఉండే మొక్కలు పాఠంలో కడియం నర్సరీలు, ఐదో తరగతిలో మన గోదావరి పాఠంలో పులసలు పాఠం, ఆరో తరగతి సైన్సు పుస్తకంలో బోన్సాయ్ మొక్కలు పాఠాలను రూపొందించారు.

వెంకటేశ్వరరావు అంబాజీపేట మండలం ముక్కామల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 4,5 తెలుగు పాఠ్య పుస్తక రచనల్లో పాల్గొన్నారు. తెలుగు భాషకు ఎస్ఆర్‌పీగా పనిచేసిన వెంకటేశ్వరరావు 4,5 తరగతి పాఠ్య పుస్తక రచనల రూపకల్పనలో పాల్గొన్నారు. అన్నం, మనజెండా పాఠ్యాంశాల రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు.

షేక్ బ్రహ్మాజీషా రాయవరం మండలం చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. మూడో తరగతి పరిసరాల విజ్ఞానం పాఠ్య పుస్తక రూపకల్పనలో పాలుపంచుకున్నారు. ప్రయాణ సాధనాలు పాఠ్యాంశం రూపకల్పన చేశారు.

గణితం పుస్తక రూపకల్పనలో..

పెద్దాపురం ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న తోటకూర సాయిరామకృష్ణ 3,4,5 తరగతుల గణితం పాఠ్య పుస్తక తయారీలో తన వంతు పాత్రను పోషించారు.

సర్వేశ్వరశర్మ..

అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఫిజిక్స్ రీడర్‌గా పనిచేసి రిటైర్ అయిన సర్వేశ్వరశర్మ పుస్తక రచయితగానే కాకుండా ఎడిటింగ్‌లో పాల్గొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయన వినియోగించుకోవడం గమనార్హం. భారతదేశం–అంతరిక్షం అనే పాఠ్యాంశాన్ని సర్వేశ్వరశర్మతో రాయించుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం వారి పాఠ్య పుస్తకంలో ప్రచురించింది.

ప్రతిభ ఆధారంగానే..

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ) నూతన పాఠ్య పుస్తకాల తయారీకి 2011 జూన్‌లో నోటిఫికేషన్ విడుదల చేసింది. నిరంతర సమగ్ర మూల్యాంకన విధానం(సీసీఈ)లో పాఠ్య పుస్తకాలను రూపొందించేందుకు ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పుస్తకాల మార్పు అవసరమా..? అయితే ఎలా ఉండాలి, వివరాలను విశ్లేషిస్తూ ఒక వ్యాసం, ఇంకా పలు ప్రశ్నలతో ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరింది. రాష్ట్ర వ్యాప్తంగా 15వేల మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేయగా, అందులో చక్కని సలహాలతో పాటు, పరిశీలకులు గుర్తించిన ప్రతిభ ఆధారంగా వీరిని ఎంపిక చేశారు.

స్వచ్ఛంద సేవకు ప్రతిరూపం



అన్నవరం దేవస్థానం ఉచితాసుపత్రి

- 76 ఏళ్ల వయసులో అలుపెరగని వైద్యసేవలు
- ఇకపై అన్నవరం ఆస్పత్రిలోనూ వైద్యం
- అనపర్తికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శ్రీలక్ష్మి

డెబ్బైఆరు సంవత్సరాల పండు వయసులో కూడా ఏమాత్రం అలసట లేకుండా పనిచేస్తున్న తీరు చూపరులకు ఆశ్చర్యం కలిగించకమానదు. వైద్యాన్ని వృత్తిగానే కాకుండా సేవగా భావించి పేద రోగుల పాలిట దైవంగా ఆమె మన్ననలు అందుకుంటున్నారు. ఆమె అనపర్తికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీలక్ష్మి. ఇకపై సత్యదేవుని సన్నిధిలో కూడా తన వైద్య సేవలు అందించడానికి సంకల్పించారు.



మహిళను పరీక్షించి మందులిస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి

అన్నవరం (ప్రత్తిపాడు) :

అన్నవరంలోని దేవస్థానం ఆస్పత్రికి మంచి రోజులొచ్చాయి. వైద్యాధికారి సమయానికి రాక, మందులు లేక ఇప్పటి వరకూ ఈ ఆస్పత్రి 'విగ్రహం పుష్టి– వైద్యం నష్టి' అనే సామెతకు నకలుగా ఉంది. అయితే దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కోరిక మేరకు అనపర్తికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీలక్ష్మి దేవస్థానం ఆస్పత్రిలో మహిళా వైద్యాధికారిగా సేవలందించనున్నారు. దేవస్థానం వసతి, మందులు సమకూర్చితే వారానికి ఐదు రోజులు అన్నవరం ఆస్పత్రిలోనే రోగులకు సేవలందించేందుకు ఆమె అంగీకరించారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో ముచ్చటించారు.

దైవ సన్నిధిలో వైద్య సేవలందించాలని...

శ్రీసత్యదేవుని సన్నిధిలో వైద్యసేవలందించాలని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కోరగా వెంటనే అంగీకరించానని డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం శని, ఆది వారాలలో రోగులకు సేవలందించాలని నిర్ణయించానన్నారు. తాను పలు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నందున కొన్ని రకాల మందులు తన వద్ద ఉన్నాయని, వాటిని ఉచితంగా రోగులకు అందచేస్తున్నామని తెలిపారు.

మహిళలకు సంబంధించిన వివిధ రోగాలను పరీక్షించి మందులివ్వడంతో బాటు ఛాతి కేన్సర్, గర్భాశయ సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తానని తెలిపారు. వీటిపై అంగన్‌వాడీలు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తానని తెలిపారు.



రోగులకు పంపిణీ చేసేందుకు తెచ్చిన మందులు

వసతులు కల్పిస్తే ఐదు రోజులు సేవలు

డాక్టర్ శ్రీలక్ష్మి ప్రస్తుతం అనపర్తి నుంచి వచ్చి వైద్యసేవలందించి తిరిగి అనపర్తి వెడుతున్నారు. దేవస్థానం అధికారులు తమకు వసతి సౌకర్యాలు కల్పించి అన్ని రకాల మందులు అందచేస్తే వారానికి ఐదు రోజులు ఇక్కడే ఉండి సేవలందిస్తామని ఆమె తెలిపారు. ఆమె భర్త జగన్నాథ రావు, ఆమె నర్సింగ్‌హోంకి చెందిన మరో ఇద్దరు సిబ్బంది ఆమెతో బాటు సేవలందిస్తున్నారు.



దేవస్థానం వైద్యసిబ్బందితో డాక్టర్ శ్రీలక్ష్మి

అన్ని సదుపాయాలు కల్పిస్తాం : ఇన్‌ఛార్జి ఈఓ

అన్నవరం ఆస్పత్రిలో వైద్యసేవలు అందించడానికి డాక్టర్ శ్రీలక్ష్మి ఏ సదుపాయాలు కోరినా ఏర్పాటు చేస్తామని దేవస్థానం ఇన్‌ఛార్జి ఈఓ ఈరంకి జగన్నాథరావు తెలిపారు. ప్రస్తుతం రెండ్రోజులు మాత్రమే పనిచేస్తానన్నారని, ఆ మేరకు సహజ ఆస్పత్రి భవనంలో బస ఏర్పాట్లు చేశామని తెలిపారు.

వైద్యవృత్తికే అంకితం...

మెడిసిన్‌లో ఉన్నత విద్యాభ్యాం చేసిన డాక్టర్ శ్రీలక్ష్మి వైద్యవృత్తిని స్వచ్ఛంద సేవకు మార్గంగా చేసుకుని రాష్ట్రంలోని ఎన్నో ప్రాంతాల్లో తన సేవలు అందించారు. 1955లో గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేసిన ఆమె గుంటూరు మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో ట్యూటర్ కం సివిల్ సర్జన్‌గా పనిచేశారు. విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో గైనకాలజీ స్పెషల్ సబ్జెక్ట్‌గా పీజీ చేశారు. 1966లో ఆంధ్రా విశ్వ విద్యాలయంలో డీజీఓ పరీక్షల్లో ప్రథమస్థానం పొంది అప్పటి రాష్ట్రపతి వీవీ గిరి చేతుల మీదుగా బంగారు పతకం పొందారు. అక్కడే ఎండీ కూడా చేశారు. భర్త జగన్నాథరావుకు ఐఎల్‌టీడీ అనపర్తికి బదిలీ కావడంతో ప్రభుత్వ ఉద్యోగం వదిలి అనపర్తిలో నర్సింగ్‌హోం నెలకొల్పి సేవ చేశారు. అప్పటి నుంచి ఆమె అటు నర్సింగ్ హోంలో సేవలందిస్తూనే రాష్ట్రంలో పలు చోట్ల మెగా వైద్య శిబిరాలు నిర్వహించి సేవ చేశారు. ప్రధానంగా జిల్లా ఏజెన్సీలో ఆమె గిరిజనులకు చేసిన వైద్యసేవలకు మెచ్చి ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సంస్థలు పలు అవార్డులు అందచేశాయి.

సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు రమణ, కలెక్టర్ కార్తికేయ మిశ్రా, ఎస్పీ విశాల్ గున్ని



- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించండి
- రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎన్నికల పరిశీలకుడు రమణ

నియమావళి ఉల్లంఘిస్తే
కఠిన చర్యలు

కాకినాడ సిటీ :

ప్రశాంత వాతావరణంలో కార్పొరేషన్ ఎన్నికలు జరిగేందుకు అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని ఎన్నికల పరిశీలకులు కేవీ రమణ కోరారు. కలెక్టరేట్ కోర్టు హాల్లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 29న జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలని హెచ్చరించారు. ఎన్నికల ఫిర్యాదుల స్వీకరణ కోసం 0884–2376051 నంబర్‌తో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే 8247511459 పరిశీలకుని నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోలింగ్ స్టేషన్లలో వినియోగించే రిజర్వుతో సహా 398 బ్యాలటింగ్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను (ఈవీఎం) సిద్ధం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ అలీంభాషా తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలకనుగుణంగా పాత డేటాను తొలగించి సిద్ధం చేశామన్నారు.

పరిశీలకుని దృష్టికి ఫిర్యాదులు

టీడీపీ అభ్యర్థుల తరపున నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో మంత్రులు ప్రభుత్వ వాహనాల్లో తిరగడం పట్ల వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రతినిధులు సీజీసీ సభ్యురాలు జక్కంపూటి విజయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి ఎంవీఎస్ మోహన్‌రావు ఫిర్యాదు చేశారు. నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలు ఈనెల 29న జరిగే ఎన్నికలపై పడుతుందని, ఎన్నికలు ముగిసే వరకూ ఓట్ల లెక్కింపు, ఫలితాలను వాయిదా వేయాలని సీపీఎం నగర కార్యదర్శి పలివెల వీరబాబు కోరారు. పొత్తులో కేటాయించిన 9 డివిజన్లలో తమ అభ్యర్థులు పోటీ చేస్తూండగా, తెలుగుదేశం రెబల్ అభ్యర్థులు నిబంధనలకు వ్యతిరేకంగా ఆ పార్టీ జెండా, చిహ్నం ఉపయోగించుకుంటూ తమ విజయావకాశాలను దెబ్బతీస్తున్నారని బీజేపీ ప్రతినిధి వి.శ్రీనివాసరాజు ఫిర్యాదు చేశారు. 47వ డివిజన్‌లోని 65–14–5 డోర్ నంబర్‌లో 256 ఓట్లు ఉన్నాయని దీనిపై పరిశీలన చేయాలని బీఎస్పీ ప్రతినిధి డి.వెంకట్ కోరారు.

పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్

పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు 10 శాతం రిజర్వుతో కలిపి 196 పోలింగ్ కేంద్రాలకు 216 ప్రిసైడింగ్ అధికారులు 216 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 723 ఇతర సిబ్బందిని నియమించగా ఆ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ఎన్ఐసీ అధికారులు నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ విశాల్ గున్ని, ఎన్ఐసీ అధికారులు ఉస్మాన్,సుబ్బారావు పాల్గొన్నారు.

- మేయర్ పీఠం వైఎస్సార్‌సీపీకే ఖాయం
- ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

గుండాగిరీకి కాదు..
గాంధీగిరీకే ఓటు



3వ డివిజన్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్ :

కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని వైఎస్సార్‌సీపీ అధిష్టించడం ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సాయంత్రం 3వ డివిజన్ గొడారిగుంటలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుర్రాల వెంకటేష్ (స్టీఫెన్)కు మద్దతుగా కార్యకర్తలు ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌లతో కలసి ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. టీడీపీ నాయకులు తమ పార్టీ అభ్యర్థులు ఓడిపోతారన్న భయంతో గూండాయిజాన్ని ప్రోత్సహించి ప్రజలను భయపెడుతున్నారని ఓటర్లు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటు వేసే ప్రజలు గాంధీగిరినే కోరుకుంటారని, రౌడీయిజాన్ని తిప్పి కొడతారని ఉమ్మారెడ్డి స్పష్టం చేశారు. మూడో డివిజన్‌లో ప్రజలు నిర్భయంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుర్రాల స్టీఫెన్‌ను గెలిపించుకొని, తమ ప్రాంతాలను అభివృద్ధికి చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతం దుస్థితి చూస్తే ఇది కాకినాడ స్మార్ట్ సిటీయా లేక ఏదైనా గిరిజన ప్రాంతంలో ఉన్నామా! అన్న అనుమానం వ్యక్తం అవుతోందని ఉమ్మారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే, డివిజన్ ఇన్‌ఛార్జి మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ ఓటర్లు ముఖ్యంగా తమకు అనుకూలంగా ఉన్న మంచి వ్యక్తిని ఎన్నుకోవాలే తప్ప, గుండాయిజాన్ని, రౌడీయిజాన్ని ప్రోత్సహించే నాయకులను కాదని అన్నారు. స్టీఫెన్ లాంటి నాయకులు డివిజన్‌లో అరుదుగా ఉంటారని, ఏ ఒక్కర్ని అడిగినా స్టీఫెన్ చాలా మంచి వ్యక్తి అని చెబుతున్నారని, అటువంటి వ్యక్తి కార్పొరేటర్ అయితే ఎంతో అభివృద్ధి జరుగుతుందని విజయప్రసాద్ అన్నారు. 3వ డివిజన్‌లో టీడీపీకి చెందిన బొడ్డు మహేష్, కొండేల సూర్యనారాయణ, సామేల్ రాజుల నాయకత్వంలో 200 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, వడ్డి మణికుమార్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మూడో డివిజన్ ఇన్‌ఛార్జి మాదబోయిన నేరేళ్ల, కర్నాశుల సీతారామాంజనేయులు, మాజీ మంత్రి కొప్పన మోహనరావు, గుర్రాల పద్మ, ధనలత, మంతిన రవిరాజు, జిన్నూరి బాబి పాల్గొన్నారు.



పోలింగ్ సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న పరిశీలకులు రమణ

పోలింగ్ సిబ్బందికి శిక్షణ

కాకినాడ సిటీ : కార్పొరేషన్ ఎన్నికల్లో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా క్రమబద్ధంగా నిర్వహించాలని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఎన్నికల పరిశీలకులు కేవీ రమణ ఆదేశించారు. రంగరాయ మెడికల కళాశాల ఆడిటోరియంలో మంగళవారం పీవో, ఏపీవోలకు ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారికంగా అనుమతించిన వ్యక్తులను మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలకు పద్ధతి ప్రకారం సీల్ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో 196 మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అలీంభాషా, డీఆర్‌డీఏ పీడీ మల్లిబాబు, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ విజయ్‌కుమార్, అర్బన్ తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాబలం లేకే ప్రలోభాలు

- నీతిమంతమైన పాలనైతే టీడీపీకి అంత భయమెందుకో?
- కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు చెవిరెడ్డి విమర్శ



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ : కోట్లలో నల్లధనం పారించైనా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలలో పరువు దక్కించుకోవడానికి టీడీపీ నేతలు పాకులాడుతున్నారని వైఎస్సార్ సీపీ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి విమర్శించారు. కాకినాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాబలం లేకపోవడం వల్లే టీడీపీ వారిలో భయం, తపన కనిపిస్తున్నాయని, డివిజన్‌కు కోటి రూపాయల వరద పారించడానికి ఆ పార్టీ నాయకులు సిద్ధమైపోయారని అన్నారు. నిజంగా మూడేళ్లలో అభివృద్ధి చేసి ఉన్నట్లయితే ఎన్నికలంటే అంత భయపడాల్సిన అవసరమేమిటన్నారు. చివరకు చంద్రబాబే స్వయంగా రెండ్రోజుల పాటు కాకినాడలో తిష్టవేసి మంత్రాంగం నడపడానికి వస్తున్నారంటే వారిలో భయం ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చన్నారు. చంద్రబాబు పతనానికి గోదావరి ప్రజలు కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల నుంచి నాంది పలకాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన వేణు, రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, మిండకుదిటి మోహన్, నక్కా రాజబాబు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గుర్రం గౌతమ్ పాల్గొన్నారు.

బాలయ్యా..
రాకుంటేనే మేలయ్యా!

- ఇదీ కాకినాడలో టీడీపీ శ్రేణుల మనోగతం
- నంద్యాలలో 'నోట్ల' నిర్వాకంతో పార్టీకి నష్టం
- ఆయన ప్రచారానికి వస్తే చేటని అభ్యర్థుల కలవరం

భానుగుడి (కాకినాడ) :

మొన్నటి వరకూ 'తొడగొట్టి' అభిమానులకు ముచ్చటగొలిపిన హీరో నందమూరి బాలకృష్ణ.. ఇప్పుడు ఆ అభిమానులనే కొడుతూ హడలెత్తిస్తున్నారు. నటునిగా హిట్లు కొట్టే మాటెలా ఉన్నా.. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా బాహాటంగా నోట్లు పంచిన ఘనతా ఆయనదే. బాలయ్య అభిమానులను కొట్టడం, నోట్లు పంచడం ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. నంద్యాలలో పార్టీ పరువును బాలయ్య బజారున పడేశారని టీడీపీ నేతలు వాపోతున్నారు. ఆయన నోట్ల పంపకంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలు అంటూ ఆంగ్లపత్రికలు సైతం తీవ్రంగా విమర్శించడంతో పార్టీని జాతీయస్థాయిలోనూ తల దించుకునేలా చేశారని మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారానికి వస్తే.. మేలు కన్నా కీడే ఎక్కువని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఆయన ఎక్కడ వస్తారోనని టీడీపీ అభ్యర్థులు బెంబేలెత్తుతున్నారంటున్నారు.

ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు నందమూరి బాలకృష్ణతో కాకినాడలో ప్రచారం నిర్వహించే దిశగా ప్రణాళిక రచించాలని సమన్వయ కర్తలను ఆదేశించారని పార్టీ వర్గాలంటున్నాయి. అయితే దీన్ని ద్వితీయ శ్రేణి నాయకులు గట్టిగా వ్యతిరేకించారని, బాలయ్య నగరంలో ఏ డివిజన్లో ప్రచారం నిర్వహించినా అక్కడ డిపాజిట్ గల్లంతయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారని తెలిసింది. నంద్యాలలో చేసిన నిర్వాకం పునరావృతమైతే.. అసలే ఓటరు ఫాలోయింగ్ అంతంతమాత్రంగా ఉన్న కాకినాడలో తుడిచి పెట్టుకుపోతామని కలవరపడ్డట్టు సమాచారం. దీంతో బాలయ్య ప్రచారంపై మంత్రులు పునరాలోచనలో పడ్డారంటున్నారు.



నేతలకు 'బాబు' తలంటు తప్పదా!

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 24, 25 తేదీలలో జిల్లాకు వచ్చే అవకాశాలున్నాయి. ఆయన పర్యటనకు సంబంధించి సోమవారం ఉదయం యనమల, రాజప్ప జిల్లాపార్టీ కార్యాలయంలో చర్చించారు. గెలుపు అవకాశాలు లేని అన్ని డివిజన్లలో చంద్రబాబు పర్యటన ఉండేలా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయడానికి సమాయత్తమయ్యారు. ఒక బహిరంగ సభ, పలు డివిజన్లలో రోడ్‌షోలు చేసేలా పర్యటన ఉంటుందని తెలుగుతమ్ముళ్ళు అంటున్నారు. అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రి పర్యటన మాటెలా ఉన్నా ఆయనొచ్చి ఇక్కడి నేతలకు తలవాచేలా చీవాట్లు పెట్టే అవకాశం ఉందంటున్నారు. డివిజన్ల వారీ ఇంటెలిజెన్స్ రిపోర్టును బట్టి రెండంకెల స్థానాలను సైతం గెలవలేని స్థితికి పార్టీ చేరిందన్న సమాచారంతోనే చంద్రబాబు నేతలపై ఫోన్‌లోనే మండిపడ్డారంటున్నారు. ఆయన పర్యటనలో డివిజన్ల వారీ బాధ్యులతో సమావేశం ఉండడంతో ఎవరికి క్లాస్ పీకుతారోనని భయం పట్టుకుంది.

సాక్షి క్లాసిఫైడ్స్



CAR FOR RENT

■ONGC, GAIL, ఇరిగేషన్, ఎయిర్‌పోర్టు, ఇతర ప్రభుత్వ కార్యాలయంలకు F/R కారు కాంట్రాక్టు పద్ధతిలో అద్దెకు ఇవ్వబడును. 70756 01512 [R-49]



PLOT FOR SALE

■RJY పరిధిలో "దివాన్ చెరువు" BVC కాలేజి ఎదుట, రాజానగరంలో గల మా DTCP ప్లాట్లు 40 మరియు 33 అ॥ల తారు రోడ్డు. 100% లోన్ సౌకర్యం, Spot రిజిస్ట్రేషన్‌కు కలవు. సెల్: 98668 61196. [R-10428]

■ రామేశ్వరం నుండి మాధవపట్నం మీదుగా కాకినాడకు వెళ్లుదారి రమేశ్వరంలో మెయిన్ రోడ్డును అనుకొని 3 బిట్లు P.NO:4,5 మొత్తం 471 చ॥గ॥ స్థలం అమ్మకం. నో బ్రోకర్స్ డై॥ సంప్ర: 8247063661 [C-617249]

■విజయవాడ బెంజి సర్కిల్‌కి కేవలం 6 కి.మీ. దూరంలో అవనిగడ్డ బైపాస్‌రోడ్, ఇన్నర్ రింగ్‌రోడ్ దగ్గర ప్లాట్లు. చ॥గ॥ రూ. 4900/–, 8200/– మీ సొంతం. ✆ 95051 83218 [B-388]

FLAT FOR SALE

26లక్షలకే ఫ్లాట్. మోరంపూడి సెంటర్‌లో 2BHK, 1050 SFT లిఫ్ట్, కార్ పార్కింగ్ అన్ని సదుపాయాలతో W/F ఫ్లాట్ బ్యాంక్ లోన్ సదుపాయంతో అమ్మకం. సం॥ప్ర. 93941 23694. [R-10419]

TO-LET

■ కాకినాడ : జగన్నాథపురం చుట్టాల వారి వీధి మంచి లోకేషన్ ఇండిపెండెంట్ బిల్డింగ్ 3BHK విశాలమైన W/F గ్రౌండ్‌ఫ్లోర్ ఉద్యోగస్తులకు అద్దెకు గలదు.సంప్ర: 80747 33618, 9440524182 [C-860760]

COMMERCIAL

■కాకినాడ : NH-216 ఓల్డ్ గైగోలు పాడు రామాలయం వెనుక 2400 sft గల G+2 బిల్డింగ్ two car parking గెస్ట్‌హౌస్ ఆఫీసర్స్ రెసిడెన్సీ/ ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును.సంప్ర: 9100121 227/ 9676237963 [C-617244]



BUSINESS OFFER



■శ్రీశైల ఆయుర్వేద ఫార్మసీ వారిచే ఆయుర్వేద వైద్యం మరియు క్లీనిక్‌లు పెట్టుకొనుటకు ఆసక్తి గల వారు అన్ని మండలాల నుండి సంప్రదించగలరు. Ph: 78935 85777, 79952 28616. [R-840240]

■రూ.75000/– లకే పేపర్ ప్లేట్స్ మిషన్లు కలవు. రా మెటీరియల్ సప్లై చేస్తాం. గవర్నమెంట్ రిజిష్టర్డ్ కంపెనీ. సం॥ప్ర॥ 97014 10924. [R-212]

■Gold Netic- బంగారం బ్యాంకులో, ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి, విడిపించి కొనబడును. మరియు మీపాత బంగారం కొనబడును. సం॥ప్ర॥ ✆ 9642796420, 9642796421 [O-595429]

కొవ్వొత్తుల తయారి

■మైనపువత్తులు తయారుచేసి రోజుకు అధిక ఆదాయం సంపాదించండి. ముడిసరుకులు మేమే ఇస్తాం, కొంటాం. No Charges. సం॥ప్ర॥ శాంతి క్యాండిల్స్. సెల్: 7550180671, 7550180681 [K-614437]

GOLD FINANCE



■బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి : ✆ 95739 44799 [B-0043]

■బ్యాంకులు, ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు పెట్టిన బంగారాన్ని మా డబ్బులతో విడిపించి ఈ రోజు మార్కెట్ రేటును బట్టి కొనబడును. క్యారెట్‌నుబట్టి రేటు. Cont: 87121 66616 [R-840348]

■బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి : ✆ 81421 30517 [B-6185]

■బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట ధరకు కొనబడును. సంప్రదించండి. ✆ 70366 81069. [B-609466]

■బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి : ✆ 79933 17340 [B-6190]

■బ్యాంకులు / సంస్థల నుండి తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సంప్రదించండి : ✆ 99088 18688 [B-513]

HEALTH CARE



■బొల్లి, తెల్లమచ్చలు, సొరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితంగా ఇవ్వబడును. సం॥ప్ర॥ 96030 55647, 79953 92747 [G-597359]

WEIGHT LOSS

■5 వారాలలో డైట్ లేకుండా 8–10 KG ల బరువు, చేతులు, తొడలు, పొట్ట సైజు, మలబద్ధకం, గ్యాస్ట్రిక్ ప్రాబ్లం, మోకాళ్ళ నొప్పులు తగ్గుతాయి. ఫోన్: 7207923767. [HA-14276]



■A.U. ద్వారా B.A.,/B.Com.,/B.Sc.,(All) వన్ సిట్టింగ్ (Disc.). ఏ విద్యార్హత లేకుండా B.A/ B.Com / B.Sc ఎంట్రన్స్. 100% పాస్ గ్యారంటీ కోచింగ్ అండ్ గైడెన్స్. M.A./M.Com/M.Sc (All) & MBA డైరెక్ట్ 10th & ఇంటర్ వన్‌సిట్టింగ్. గత 27సం॥లుగా 100% ఫలితాలు. మోడ్రన్, తాడేపల్లిగూడెం. : 98482 28758, 83097 36046. [P-26]

HOTEL MANAGEMENT COURSE

■ మీరు 10th/ఇంటర్ పాస్/ఫెయిల్! 100% జాబ్ గ్యారంటీ Diploma 6 Month's, PG Diploma 1 Year, BHM 3 Year's Batch ప్రారంభం. అతి తక్కువ ఫీజుతో MJS, NAD, Vizag. Ph : 96761 00089, 96762 00089 [V- 596961]



■ రిజిస్ట్రేషన్ గుర్తింపు పొందిన సంస్థ నందు రికార్డు వర్క్ చేయుటకు అభ్యర్థులు కావలెను .జీతం:9000/- సంప్రదించండి: 78934 96089. [P- 856316]

■7th, 10th, ఇంటర్, ITI, డిప్లమో చదివిన యువతీ యువకులకు మా SP BM Govt(R) సంస్థ నందు పర్మినెంట్ జాబ్స్ కలవు. Age: 17to 24, నో ఫీజు, రూంఫ్రీ. S: 5to25వేలు. Cont: 88864 93209. [R-840343]

■ప్రయివేటు బ్యాంకులలో మరియు ప్రముఖ ఆర్థిక సంస్థలో, ఫైనాన్స్ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశములు కలవు. వయస్సు : 18–35 సం॥లు. అర్హత : ఇంటర్ to పి.జి. సెల్ : 76599 26030 [R-40]

■రాజమండ్రిలో ప్రముఖ ఆఫీసునందు ఉద్యోగం చేయుటకు యువతులు (F) కావలెను. ఆకర్షణీయమైన జీతం. (10 A.M. to 6.00 P.M) సంప్ర॥ 94408 51377 & 81436 24444 [R-228]

■హాస్పటల్ నందు పనిచేయుటకు నర్సులు (ANM, GNM, B.Sc.,నర్సింగ్), కాంపౌండర్స్, ఆయాలు, సెక్యూరిటీగార్డ్స్, డ్రైవర్స్ వెంటనే కావలెను. అనుభవం గలవార్కి ప్రాధాన్యత. Cont : నవీన్ మల్టీస్పెషాలిటీ హాస్పటల్, AVA రోడ్, రాజమండ్రి. [R-840345]

■చిన్నపిల్లల ఆసుపత్రి నందు NICU లో పనిచేయుటకు ANM/GNM చేసిన అనుభవం ఉన్న నర్సులు కావలెను. సిద్ధార్థ చిల్డ్రన్స్ క్లినిక్, కాకినాడ. ఫోన్ : 2364858, 94406 94269. [R-37]

■ఉద్యోగాలు: మీ సొంత జిల్లా మండలాల్లో D.O ఉద్యోగాలకై 10th to డిగ్రీ గల స్త్రీ/పు॥ కావలెను. జీతం 8500వేలు వెంటనే ఫోన్/ మీ పూర్తి అడ్రస్ SMS చేయండి. శ్రీనివాస గ్రూప్స్ వరంగల్ సెల్: 7893866238 [WA-545]

■ ప్రముఖ DS-Max కం॥లో (15,000 – 20,000) 180 మంది యువకులు వెంటనే నియామకం. అ: MBA, MCA, P.G, డిగ్రీ, Dip, ITI, ఇంటర్, 10th. వ: 26 సం॥లోపు. ✆ 73962 84477, 0891- 6569111 [V- 354]

■ ఒక ప్రఖ్యాత ల్యాప్‌టాప్ కంపెనీకి ప్రమోటర్స్ & హార్డ్‌వేర్ సర్వీస్ ఇంజనీర్స్,ఆఫీస్ బాయ్స్ కావలెను. రాజమండ్రి లోకల్ వారికి ప్రాధాన్యత CITY కంప్యూటర్స్ రాజమండ్రి.మెయిన్ రోడ్డు.సంప్ర: 9949164777 [C-860759]

■ హైదరాబాద్‌లో ముసలి వారికి మంచన ఉన్నవారికి 24గం॥లు సేవలు చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. భోజనం + వసతి + జీతం సంప్రదించండి : 91216 39596, 90630 10428. [P- 601798]

■ 10th, ఇంటర్ (P/F) కలిగిన APEX కం.లో జాబ్ చేయుటకు 28 సం॥లలోపు యువకులు కావలెను. వేతనం కేటగిరిని బట్టి నిర్ణయిం చెదరు. రూమ్ ఫ్రీ. ఫీజ్‌లేదు. ✆ 91824 27345 [B-1295]

■ విజయవాడలోని ప్రముఖ డిజిటల్ కలర్ ల్యాబ్‌కు రాజానగరంలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Q: డిగ్రీ, మంచిజీతం + ఇన్సెంటివ్స్ + అలవెన్స్. 2 వీలర్ మస్ట్, పైప్రాంతాలవారికి ప్రాధాన్యత. ✆ 83675 56999, 80961 85999 [B-573]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పర్యావరణ యజ్ఞానికి శ్రీకారం

- మాలధారణ చేసిన సురుచి ఫుడ్స్ సిబ్బంది
- రెండడుగులు పైబడిన మట్టి విగ్రహానికి ఐదు కిలోల లడ్డూ
- ఇప్పటికే 620 ఉత్సవ కమిటీల నుంచి ఆర్డర్లు
- వెయ్యి వరకు వస్తాయని ఆశిస్తున్నాం: మల్లిబాబు



పర్యావరణ లడ్డూల తయారీ కోసం మాలధారణ చేసిన సురుచి సిబ్బంది

గణేష్ ఉత్సవాలు వస్తున్నాయంటే వెంటనే గుర్తుకు వచ్చేది తాపేశ్వరం. మడత కాజాలతో పాటు భారీ లడ్డూల తయారీలోనూ ఈ గ్రామం ప్రసిద్ధి చెందింది. గణేష్ ఉత్సవాల సందర్భంగా గతేడాది 28.9 టన్నుల భారీ లడ్డూను తయారు చేసి సురుచి ఫుడ్స్ సరికొత్త గిన్నిస్ రికార్డ్సును నెలకొల్పిన సంగతి తెలిసిందే. భారీ లడ్డూల తయారీలో ఇప్పటి వరకు ఉన్న రికార్డు ఇదే కావడం గమనార్హం. ఏటా మాదిరి హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో ప్రతిష్ఠించే గణనాథుడికి 500 కిలోల లడ్డూ, తెలంగాణభవన్ సమీపంలోని పూరి జగన్నాథుడి ఆలయం వద్ద ప్రతిష్ఠించే వినాయకుడికి 100 కిలోల లడ్డూను, జిల్లాలోని బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయానికి 25 కిలోలు, అయినవిల్లి సిద్ధి వినాయకుడికి 50 కిలోలు, రామచంద్రపురంలోని డఫేదార్ వినాయకుడికి 50 కిలోల లడ్డూలను ఉచితంగా అందివ్వనున్నారు. తాజాగా ఈ ఏడాది గణేష్ ఉత్సవాల్లో భాగంగా జలకాలుష్యాన్ని నివారించడంలో భాగంగా మట్టి విగ్రహాల ఏర్పాటుకు సురుచి సంస్థ ప్రోత్సాహాన్ని అందిస్తోంది. అందుకోసం రెండు అడుగులకు పైబడి గణనాథుడి మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించే ఉత్సవ కమిటీలకు ఐదు కిలోల లడ్డూను ఉచితంగా అందించనున్నట్టు ప్రకటించింది. అందులో భాగంగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 620 వరకు ఆర్డర్లు వచ్చినట్టు సురుచి సిబ్బంది తెలిపారు.

> *తాపేశ్వరం.. ఈ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది తేనెలొలికే మడత కాజాలు, కొండలను తలపించే గణనాథుడి లడ్డూలు. 28 టన్నుల లడ్డూ తయారీతో గతేడాది సరికొత్త గిన్నిస్ రికార్డ్సు నెలకొల్పిన తాపేశ్వరంలోని సురుచి ఫుడ్స్ సంస్థ.. ఈ ఏడాది గణేష్ ఉత్సవాల్లో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఎక్కడైనా రెండు అడుగులకు పైబడి మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించే కమిటీలకు ఐదు కిలోల లడ్డూను ఉచితంగా అందజేయనున్నట్టు ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 600లకు పైబడి ఆర్డర్లు రాగా.. లడ్డూల తయారీకి సురుచి సిబ్బంది మంగళవారం గణపతి మాలధారణతో శ్రీకారం చుట్టారు.*
> – తాపేశ్వరం (మండపేట)

మాలధారణతో లడ్డూ తయారీకి శ్రీకారం

లడ్డూల తయారీ కోసం 11 మంది సురుచి సిబ్బంది మంగళవారం గణపతి మాలధారణ చేశారు. సురుచి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో మిఠాయి మేస్త్రి గణనాథుడిని ప్రతిష్ఠించారు. అనంతరం పూజలు నిర్వహించి, లడ్డూల తయారీకి బూందీ తీయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా సురుచి అధినేత పోలిశెట్టి మల్లిబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 620 వరకు ఆర్డర్లు వచ్చాయన్నారు. కమిటీల నుంచి మంచి స్పందన లభిస్తోందని, వెయ్యికి పైగా మట్టి విగ్రహాలు ఏర్పాటు జరుగుతుందని భావిస్తున్నట్టు వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జలకాలుష్యాన్ని అరికట్టేందుకు ఉత్సవ కమిటీలు మట్టి ప్రతిమలు ఏర్పాటుచేయాలని కోరారు. సురుచి పీఆర్వో వర్మ, మేనేజర్ శంకర్, కుక్ బప్పీ, మల్లి పాల్గొన్నారు.

ముగ్గురు ఏపీఎంల సస్పెన్షన్

కాకినాడ సిటీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ చేపట్టిన పలు పథకాల్లో ప్రగతి లేకుండా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అనపర్తి, రంగంపేట, రౌతులపూడి ఏపీఎంలు జె.నారాయణ, కె.ఎర్రినాయుడు, వి.రమణకుమారిలు సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు మంగళవారం డీఆర్‌డీఏ పీడీ ఎస్.మల్లిబాబు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్లాంటేషన్, హార్టికల్చర్‌లో ప్రగతి లేకపోవడంతో.. ఏపీఎంలపై చర్యలు తీసుకున్నట్టు పీడీ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలు మండలాల ఏపీఎంలపై చర్యలు తీసుకునేందుకు నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది.

రేపు జేఎన్‌టీయూకేలో క్యాంపస్ డ్రైవ్

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో గురువారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పీఆర్‌వో సీహెచ్ సాయిబాబు మంగళవారం తెలిపారు. వాక్రో బైనరీ సిమాంటిక్స్ ఎల్ఎల్‌పీ సంస్థ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తుందని, 2017లో ఉత్తీర్ణులైన జేఎన్‌టీయూకేకు అనుబంధ కళాశాలకు చెందిన అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గాలికుంటు.. తరిమికొట్టు

- వర్షాకాలంలో వ్యాధి తీవ్రత అధికం
- ఈ నెల 26 నుంచి వ్యాధి నివారణా టీకాలు

రాయవరం(మండపేట):

వర్షాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి(పుట్ అండ్ మౌత్ డిసీజ్) సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల వల్ల ఉత్పాదకత తగ్గుతుంది. తద్వారా పశుపోషకులకు ఆర్థిక నష్టం కలుగుతుంది. పశుపోషకులు సరైన చికిత్సా విధానాలు పాటిస్తే పశువులను ఈ వ్యాధి బారి నుంచి కాపాడుకోవచ్చని రాయవరం ఏరియా పశువైద్యశాల ఏడీ డాక్టర్ ఎం.రామకోటేశ్వరరావు స్పష్టం చేశారు.



పశువులు

జిల్లాలో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 25వ తేదీ వరకు 24వ విడత గాలికుంటు సామూహిక నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు ఆయన మాటల్లోనే..

వ్యాధి లక్షణాలు

గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఎక్కువ. దీని వల్ల మరణాల శాతం తక్కువైనప్పటికీ పశువుల్లో ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గుతుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. వేడిని తట్టుకోలేవు. ఈ వ్యాధికి గురైన గేదె, మేక, గొర్రె వంటి జీవాలకు తీవ్రమైన జ్వరం వస్తోంది.
పాల దిగుబడి తగ్గడం, నోరు, మూతి, కాళ్లు, పొదుగు మీద పుండ్లు, బొబ్బలు కనపడటం, కాళ్లు కుంటడం, నోటి నుంచి విపరీతంగా నురగ కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. పొదుగుపై బొబ్బలు ఏర్పడి ఒక్కొక్కసారి పొదుగువాపు సంభవిస్తుంది. పశువులు శ్వాసను కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ ఎండవేడిమికి తట్టుకోలేక నీరసించిపోతాయి.



కాలి గిట్టల్లో ఏర్పడిన పుండు



పశువు నోటిలో ఏర్పడిన పుండు

వ్యాధి వ్యాప్తి చెందే విధానం

నోరు, కాలు వ్యాధికి గురైన పశువుల అంతస్రావాల(లాలాజలం, పుండ్ల నుంచి కారే రసి) వల్ల వ్యాధి మిగతా పశువులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధికారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. సంకరజాతి పశువులు త్వరగా ఈ వ్యాధి బారిన పడతాయి.

నివారణ ఇలా..



పశువులు బాగా బలహీనంగా ఉంటే గ్లూకోజ్ రక్తంలోకి ఇవ్వాల్సి ఉంటుంది. నోటిలో పుండ్లు వల్ల మేత మేయవు. కనుక వాటికి సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారం అందించాలి. జావ, జొన్న, అన్నం, ఉపు, బెల్లంతో కలిపి ప్రతి రోజూ తాగించాలి. ఈ వ్యాధి సోకిన పశువులను వేరు చేయాలి. వీటి మలమూత్రాలను గడ్డిలో కాల్చివేయాలి. చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి. ఆబోతులు, దున్నల వీర్యం ద్వారా కూడా వ్యాధి వ్యాపిస్తుంది. అందువల్ల వ్యాధి సోకిన వాటిని సుమారు మూడు నెలల వరకు సంపర్కానికి వినియోగించకూడదు.

చికిత్స

కాలిగిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావకాలతో కడిగి నీమ్‌లెంట్, వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి గ్లిజరిన్ కలిపి పూయాలి. వైద్యుడిని సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

టీకాలు తప్పనిసరి

గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. ప్రస్తుతం జిల్లాలో పశువైద్య శాఖ ద్వారా ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 25వ తేదీ వరకు ఉచితంగా లభించే వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేయించాలి.

ఆంధ్రనాట్యం పూర్వవైభవం పొందాలి

- నాట్యకళాకారుడు ఆచంట చంద్రశేఖర్
- ఉభయ రాష్ట్రాల కళాకారులతో రెండు రోజుల సదస్సులు



ఆంధ్రా నాట్య సదస్సులో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాట్యాచార్యులు ఆచంట చంద్రశేఖర్

రాజమహేంద్రవరం కల్చరల్ : కూచిపూడి కన్నా ప్రాచీనమైన ఆంధ్రనాట్యం పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలనే ఆకాంక్షతో రెండు రోజుల సదస్సులు, నాట్యప్రదర్శనలు ఏర్పాటు చేశామని కళాప్రియ నృత్యకళాక్షేత్రం వ్యవస్థాపకుడు, నిర్వాహకుల్లో ఒకరయిన ఆచంట చంద్రశేఖర్ వెల్లడించారు. స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని కళాప్రియ నృత్యకళాక్షేత్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రాష్ట్రం విడిపోయాక, తెలంగాణ రాష్ట్రం ఆంధ్రనాట్యంలో ఒక భాగమైన పేరిణి నృత్యాన్ని ప్రోత్సహిస్తున్న తరుణంలో మన రాష్ట్రంలో అతి పురాతనమైన ఆంధ్రనాట్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని సదస్సులో కోరతామన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నగరానికి చెందిన కళాప్రియ నృత్యకళాక్షేత్రం, విజయవాడకు చెందిన రామకృష్ణ నృత్యకళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో 26, 27 తేదీల్లో ఆనం కళా కేంద్రంలో ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన నాట్యాచార్యులతో రెండు రోజుల సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు.

26న ఉదయం 10 గంటలకు కుంభహారతి, పుష్పాంజలి కార్యక్రమాలు, 11 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి ఆంధ్రనాట్య నర్తన సమాహారం ఉంటుందన్నారు. 27న ఉదయం 10 గంటలకు కుంభహారతి, పుష్పాంజలి తరువాత 11 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి నర్తన సమాహారం, రాత్రి 8 గంటలకు సభాకార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత అన్నాబత్తుల లక్ష్మీమంగతాయారు, ఉత్తమనర్తకి అవార్డు గ్రహీత అన్నాబత్తుల లీలసాయిలను సత్కరిస్తామన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నగర ప్రముఖులు పాల్గొంటార్నారు. అనంతరం బ్రోచరును ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో ఫణిన్మయి, లక్కా సతీష్, ఎస్.కె.వి.టి.కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ పి.వి.బి.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత బైపాస్‌కు సర్వే

- కాకినాడ నుంచి అన్నవరం వరకూ
- ఏపీ రోడ్ల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డీపీ రిపోర్టు
- 43 కిలోమీటర్లు నాలుగులైన్ల రోడ్డు విస్తరణకు సన్నాహాలు



పెరుమాళ్లపురంలో రోడ్డు విస్తరణకు సర్వే చేస్తున్న ఏపీఆర్‌డీసీ సర్వే అధికారుల బృందం

తొండంగి(తుని): విశాఖ చెన్నై కోస్టల్ కారిడార్‌లో భాగంగా కాకినాడ నుంచి అన్నవరం వరకూ బైపాస్ రోడ్డు నిర్మించేందుకు సర్వే పనులు మంగళవారం పెరుమాళ్లపురంలో ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏడీబీ నిధులతో కాకినాడ నుంచి ఉప్పాడ, పెరుమాళ్లపురం మీదుగా అన్నవరం 16వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధానించేందుకు 43 కిలోమీటర్లు పొడవునా, 70 మీటర్లు వెడల్పుతో నాలుగులైన్ల రోడ్డును విస్తరించి అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో ఏపీఆర్‌డీసీ ద్వారా ఈ సర్వేకు సంబంధించి డీటైల్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించేందుకు శాత్రా కన్సెల్టెన్సీకి అప్పగించారు. ఈ నేపథ్యంలో పెరుమాళ్లపురంలో సర్వే ప్రతినిధుల బృందం సర్వే పనులు ప్రారంభించింది.ఈ సందర్భంగా సంస్థకు చెందిన సర్వే సామాజిక నిపుణుడు పి.దేవరాజు మాట్లాడుతూ సర్వేలో రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ భూమితోపాటు ప్రభుత్వ ఆస్తులు, ఆలయాలు, ప్రైవేటు ఆస్తులకు చెందిన ఎన్ని ఇళ్లు తొలగించాలి? తదితర అంశాలను గుర్తించి వాటికి నంబర్లు కేటాయిస్తామన్నారు. రోడ్డు విస్తరణకు కొలతల ప్రకారం మార్కింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. విస్తరణలో నష్టపోతున్న లబ్ధిదారులు సామాజిక, ఆర్థిక తదితర వివరాలను సర్వే ఫాంలో నింపి నివేదిక రూపొందించి, అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ, సలహాలు తీసుకుంటామని చెప్పారు. ప్రధాన రహదారి మధ్య నుంచి 35 మీటర్లు చొప్పున రెండు వైపులా విస్తరించాల్సి ఉందన్నారు. మరో 20 రోజుల పాటు ఈ పనులు జరుగుతాయని, త్వరితగతిన సర్వే పనులను పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఆయన వెంట ఎస్.రాంబాబు, బి.ప్రసాద్, గణేష్, డి.రాజు, ఎస్.విజయ్‌కుమార్ తదితర సిబ్బంది ఉన్నారు.

జానపదాన్ని రక్షించే బాధ్యత అందరిదీ



అశోక్‌తేజను సత్కరించి, జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం



డప్పు నృత్యం

ప్రముఖ సినీ, జానపద గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ

రాజరాజనరేంద్రనగర్ (రాజానగరం) : మన చరిత్ర, సంస్కృతులకు మూలం జానపదమని, దానిని పరిరక్షించుకోవల్సిన బాధ్యత అందరిపైన ఉందని ప్రముఖ సినీ, జానపద గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. మన పూర్వీకులు, వారి జ్ఞాపకాలు ఏవిధంగా మ్యూజియంలో భద్రపరుచుకుంటున్నామో అదే విధంగా జానపదాలను కూడా భద్రపరచి, భావితరాలకు అందించాలన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో తెలుగు విభాగం, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) లు సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ జానపద దినోత్సవాన్ని మంగళవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో నేడు గొప్పగా చెప్పుకుంటున్న సాహిత్యానికి, సంస్కృతికి మూలం జానదపమేనన్నారు.

సినీరంగంలో తనకు ప్రోత్సాహాన్నిచ్చిన దాసరి నారాయణరావును స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఉపకులపతి ఆచార్య ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రజల మనస్సుల్లో భావాలను అక్షరాలుగా తయారు చేసి, నేల తల్లిని తన పాటతో పులకరింపజేయడం సుద్దాలకే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఆయన రచించిన అమరావతి గీతాన్ని యూనివర్సిటీకి అంకితం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఈ సందర్భంగా జానపద కళాకారుల వీరనాట్యం, డప్పు నృత్యం, గరగ నృత్యం వంటి ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం 30 మంది జానపద కళాకారులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. డీన్ ఆచార్య ఎస్.టేకి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎ. మట్టారెడ్డి, డాక్టర్ వి. పెర్సిస్, డాక్టర్ కె. సుబ్బారావు, డీన్స్ డాక్టర్ పి. సురేష్‌వర్మ, డాక్టర్ పి. వెంకటేశ్వర్రావు, ఈసీ మెంబర్ డాక్టర్ పి. విజయనిర్మల, రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ టి. మురళీధర్, సదస్సు నిర్వాహకులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, డాక్టర్ ఎన్. కిరణ్‌చంద్ర, డాక్టర్ టి.వాసు పాల్గొన్నారు.

టీడీపీతోనే బ్రాహ్మణులకు గుర్తింపు

రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి

భానుగుడి(కాకినాడ): స్వాతంత్ర్య వచ్చిన తరువాత బ్రాహ్మణులకు గుర్తింపునిచ్చి, కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత టీడీపీదేనని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య పేర్కొన్నారు. స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కాకినాడ నగరంలో 1400 కుటుంబాలకు రూ.2.80 కోట్లు ఇచ్చిన ఘనత టీడీపీకి దక్కుతుందన్నారు. బ్రాహ్మణులకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి డొక్కా నాగబాబు పలువురు బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీపై మంత్రి ప్రత్తిపాటి విమర్శలు

మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వైఎస్ఆర్ సీపీపై పలు విమర్శలు చేశారు. అవినీతికి ఆ పార్టీ బ్రాండ్ అంబాసిడర్ అని ఆరోపించారు. వైఎస్సార్ సీపీకి వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులుండరని, ప్రస్తుతం కాకినాడలో బూత్ ఏజెంట్లు లేని పరిస్థితి ఉందన్నారు.

మూడున్నరేళ్ల పాలనలో ఒరిగిందేమీ లేదు

సీపీఎం జిల్లా కార్యదర్శి దువ్వా శేషబాబ్జీ

కాకినాడ సిటీ : టీడీపీ, బీజేపీల మూడున్నరేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి దువ్వా శేషబాబ్జీ విమర్శించారు. మంగళవారం స్థానిక సుందరయ్యభవన్‌లో పార్టీ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటీ పేరు చెప్పటానికే గాని నగరానికి నిధులు గానీ, అభివృద్ధి గాని ఏమీ జరగలేదన్నారు. నగరంలో పేదలకు సెంటు భూమి ఇవ్వడం లేదుగాని ఖరీదైన స్థలాలు కాజేయడంలో నాయకులు తలమునకలై ఉన్నారని ఆరోపించారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు

కంబాలచెరువు : ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు మంగళవారం నిరసన తెలిపారు. యూనివర్సిటీ, కళాశాల అధ్యాపకులకు వర్తించే ఏడో వేతనసంఘం నివేదికను వెల్లడిచేయడంలో తీవ్ర జాప్యం జరుగుతున్న నేపథ్యంలో అధ్యాపకులందరూ మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని అన్ని విభాగాల్లో జనవరి 2016 నుంచి ఏడో వేతన సంఘం ప్రకారం పెరిగిన జీతాలు పొందుతున్నప్పటికీ అధ్యాపకుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రత్నమాణిక్యం, డాక్టర్ డీవీ.నాగేశ్వరరావు, డాక్టర్ పి.షణ్ముఖరావు, బీవీ.నర్సారెడ్డి, మాధవి, ఎ.అన్నపూర్ణ పాల్గొన్నారు.

అజ్జరపు వాసుకు బెయిల్ మంజూరు



అజ్జరపు వాసును కోర్టుకు తీసుకువస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం క్రైం : మణప్పురం గోల్డ్ లోను వ్యవహారంలో మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసును పోలీసులు అరెస్టు చేసేందుకు చేసిన యత్నాలు మాజీ ఏపీఐఐసీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం రాకతో సద్దుమణిగాయి. సోమవారం కోర్టుకు హాజరయ్యేందుకు వస్తున్న వాసును అరెస్ట్ చేసేందుకు కోర్టు ముందు పోలీసులు మోహరించారు. అయితే ముందస్తు బెయిల్ ఉన్న వ్యక్తిని ఎలా అరెస్టు చేస్తారంటూ శివరామ సుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. పోలీసులు చట్ట ప్రకారం వ్యవహరించాలని దుందుడుకుగా వ్యవహరిస్తే మంచిది కాదన్నారు. మంగళవారం తానే స్వయంగా కోర్టుకు తీసుకువచ్చి హాజరు పరుస్తానని హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో మంగళవారం శివరామ సుబ్రహ్మణ్యం కారులోనే మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసును కోర్టుకు తీసుకువచ్చారు. కోర్టులో హాజరు పరిచిన అనంతరం బెయిల్ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కేబుల్ రమణ, కోయ్యల రమణ, కోల్లిమళ్ల రఘు, అగురుధన పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

కంబాలచెరువు : వసతిగృహంలోని విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాజమహేంద్రవరం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. స్థానిక సమీకృత సంక్షేమ బాలికల వసతిగృహాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశీలించారు. వసతిగృహంలో జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినులను గుర్తించిన ఆయన వెంటనే వారికి వైద్య పరీక్షలు చేయించాలని తెలిపారు. ప్రతీ ఆరుగంటలకు ఒక పర్యాయం విద్యార్థినుల ఆరోగ్య వివరాలను అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారికి తెలియజేయాలన్నారు. వసతిగృహంలో పరిసరాలు, గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా బీసీ సంక్షేమసంఘం డిప్యూటీ డైరెక్టర్ ఎం.చిన్నబాబు, సహాయ బీసీ సంక్షేమశాఖాధికారి సీహెచ్.నాగలక్ష్మి ఉన్నారు.

మతసామరస్యంతో మెలగాలి

- అర్బన్ ఎస్పీ రాజకుమారి
- వినాయక చవితి పందిళ్ల ఏర్పాటుపై సమావేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అర్బన్ ఎస్పీ రాజకుమారి తదితరులు

తాడితోట : మత సామరస్యంతో మెలిగి వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలని రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ఎస్పీ బి.రాజకుమారి తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరం ఆర్ అండ్ బీ అతిథిగృహంలో వినాయక చవితి ఉత్సవ కమిటీలు, వివిధ మతాలకు చెందిన మతపెద్దలు, సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అర్బన్ ఎస్పీ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసినప్పటి నుంచీ నిమజ్జనం చేసే వరకూ ఉత్సవ కమిటీ నాయకులు విగ్రహం వద్ద ఎవరో ఒకర్ని నియమించాలన్నారు. రాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, అవాంఛనీయమైన సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చవితి పందిళ్ల వద్ద అశ్లీల పాటలు, నృత్యాలు ఏర్పాటు చేయకూడదన్నారు. అనుమతి లేకుండా మైక్ సెట్లు వినియోగించవద్దన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పందిళ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బలవంతంగా చందాలు వసూలు చేయవద్దని, వాటిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.

అనుమతి తప్పనిసరి

వినాయక చవితి పందిళ్లు వేసే ముందు మున్సిపల్ అధికారులకు దరఖాస్తు చేసుకొని అనుమతి తీసుకోవాలని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఫణి రామ్ తెలిపారు. పందిరి కోసం రోడ్డుపై గోతులు తీస్తే వాటిని ఉత్సవ కమిటీ సొంత ఖర్చులతో పూడ్చాలన్నారు. మున్సిపల్ సిటీ ప్లానర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ వినాయక చవితి పందిళ్లు వేసే ముందు రూ.పది వేలు డిపాజిట్ కట్టాలని, దరఖాస్తులో ఇచ్చిన సూచనలు తప్పకుండా పాటించాలని కోరారు. అనంతరం నియమ నిబంధనలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రజనీకాంత్ రెడ్డి, డీఎస్పీలు కులశేఖర్, రామకృష్ణ, వైవీ రమణ కుమార్, రమేష్ బాబు, శ్రీనివాసరావు, భరత్ మాతాజీ, జాంపేట మసీదు అధ్యక్షుడు అబీబుల్లా ఖాన్, దండోరా నాయకుడు వైరాల అప్పారావు, ఎస్సీ సెల్ నాయకులు తాళ్లూరి విజయ్‌కుమార్, కార్పొరేటర్లు, వివిధ సంఘాల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఎయిర్‌మెన్ శిక్షణ ప్రారంభం



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హరిశ్చంద్ర ప్రసాద్

కంబాలచెరువు : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, యువజన సర్వీసుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్స్ ఎయిర్‌మెన్ శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎయిర్‌మెన్ ఉద్యోగాలకు సెప్టెంబర్ తొమ్మిదో తేదీ వరకు 20 రోజుల పాటు 150 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. దీనితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యం, భావ వ్యక్తీకరణ, వ్యాయామం వాటిలో శిక్షణ ఇస్తామన్నారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ కె.సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులకు భావవ్యక్తీకరణ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డి.రుద్ర, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ కె.రత్నమాణిక్యం, డాక్టర్ పి.షణ్ముఖరావు, జె.యాకోబ్, బి.గీతాదేవి, బి.మాధవ్, ఆర్.రమేష్‌కుమార్, యు.రమేష్‌బాబు, ఎ.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ ప్రాక్టీషనర్స్ సమావేశం

కంబాలచెరువు : ముఖ్యమంత్రి చంద్రబాబు తమ సేవలను గుర్తించారని ఫస్ట్ ఎయిడ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర అధ్యక్షులు ఏడీ.కామాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ప్రాథమిక వైద్యులకు శిక్షణ తరగతుల చట్టబద్ధమైన గుర్తింపుకొరకు వైద్య సంఘాలు చేస్తున్న కృషి ఫలించిందన్నారు.

జియోన్‌లో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు



చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న అభిమానులు

కంబాలచెరువు : మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు జియోన్ అంధుల పాఠశాలలో మంగళవారం జరిగాయి. ముఖ్యఅతిథిగా అనూశ్రీ సినిమాస్ అధినేత ఎ.సత్యనారాయణ హాజరై కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా చిరంజీవిని ఆదరిస్తున్నారన్నారు. నగర కాంగ్రెస్ నాయకులు బోడా వెంకట్ మాట్లాడుతూ పేదలకు అతిసన్నిహితంగా ఉండే వ్యక్తి చిరంజీవి అని, ఆయన పేరుతో చేస్తున్న సేవలకు మంచి గుర్తింపు లభిస్తోందన్నారు. కార్యక్రమంలో చాపల రాజు, కేవీ.చలపతిరావు, చిత్రకళా బాబ్జీ, అజ్జి రవికుమార్, గొల్లపల్లి త్రిమూర్తులు, కొండపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల 'మాక్ డ్రిల్'



కేడెట్లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కంబాలచెరువు : రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి..రక్తం ధారలుగా పారుతోంది...కొద్ది సమయం దాన్ని ఆపగలిగితే ఒక నిండు ప్రాణాన్ని కాపాడవచ్చు. ఏం చేయాలి, ఎలా చేయాలి...అక్కడ వారంతా తర్జనభర్జన పడుతున్నారు. ఇంతలో కొందరు విద్యార్థులు వచ్చి వెంటనే ఆ క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స నందించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అతను ప్రాణాలను బతికి బయటపడ్డాడు. ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ కేడట్లకు పకృతి వైపరీత్యాలపై స్పందించే విధానాలపై శిక్షణలో మాక్‌డ్రిల్‌లో భాగంగా మంగళవారం ఆ హడావుడి చోటుచేసుకుంది. రెడ్‌క్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణలో ఎన్‌సీసీ కేడెట్లకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. శ్వాస అందనప్పుడు ఏ విధంగా స్పందించాలి, గుండెపోటు వచ్చినప్పుడు తక్షణ చికిత్స చేసే విధానాలను వారికి చేసి చూపారు. అలాగే



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థినులు

ప్రమాద సమయాల్లో కాళ్లు, చేతులు విరిగిపోవడంతో ఆసుపత్రికి తీసుకువచ్చే లోపు వారికి తీవ్రనష్టం జరగకుండా చేసే పలు విధానాలను వారికి స్వీయశిక్షణ ఇచ్చారు. శరీరం కాలినప్పుడు జాగ్రత్తలను పాటించకపోతే జరిగే నష్టాలను వివరించారు. బుధవారం జరిగే శిక్షణ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఏ చేయాలి, ప్రమాద భాదితులను ఎలా కాపాడాలనే అంశాలపై శిక్షణ ఉంటుందని రెడ్‌క్రాస్ రీజినల్ కో ఆర్డినేటర్ గంటా వెంకటరవికుమార్ అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డి.రుద్ర, డాక్టర్ పడాల షణ్ముఖరావు పాల్గొన్నారు.

'రెడ్ రివర్' అని ఏ నదిని పిలుస్తారు?



ముల్కల రమేష్
సబ్జెక్టు నిపుణులు

జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పశ్చిమ కనుమల్లో జన్మించని నది ఏది?
1) గోదావరి 2) కృష్ణా 3) శరావతి 4) మహానది

2. కృష్ణానది ఏ ప్రాంతంలో సముద్రంలో కలుస్తుంది?
1) అంతర్వేది 2) దివిసీమ 3) హంసలదీవి 4) కృష్ణపట్నం

3. కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
1) కోసి నదిని 'బిహార్ దుఃఖదాయని' అని పిలుస్తారు
2) దామోదర్ నదిని 'బెంగాల్ దుఃఖదాయని' అని పిలుస్తారు
3) గండక్ నదిని 'అసోం దుఃఖదాయని' అని పిలుస్తారు
4) భారత్‌లో అతి పొడవైన నది గంగా

4. ప్రపంచంలో అతిపెద్ద డెల్టా అయిన 'సుందర్‌బన్స్ డెల్టా' ఏ నదుల వల్ల ఏర్పడింది?
1) సింధూ, బ్రహ్మపుత్ర 2) బ్రహ్మపుత్ర, గంగా 3) సింధూ, గంగా 4) గంగా, యమున

5. కింది వాటిలో ఏ రెండు నదులు దాదాపుగా ఒకే ప్రాంతంలో జన్మిస్తాయి?
1) గంగా, సింధూ 2) గంగా, బ్రహ్మపుత్ర 3) బియాస్, తపతి 4) సింధూ, బ్రహ్మపుత్ర

6. కృష్ణానది జన్మస్థానం ఏది?
1) మానస సరోవరం 2) మహాబలేశ్వరం 3) త్రయంబకేశ్వర్ 4) చిక్‌బల్లాపూర్

7. కింది వాటిలో ఉత్తరం వైపు ప్రవహించే నది ఏది?
1) కావేరి 2) నర్మద 3) చంబల్ 4) బ్రహ్మపుత్ర

8. కింది వాటిలో ఉత్తర భారతదేశం నుంచి దక్కన్ పీఠభూమిని విభజించే నది ఏది?
1) చంబల్ 2) కృష్ణా 3) గోదావరి 4) నర్మద

9. 'జయమంగళి' అనేది ఏ నదికి ఉపనది?
1) కృష్ణా 2) తుంగభద్ర 3) మంజీర 4) పెన్నా

10. అలకనంద, భాగీరథి నదులు ఏ ప్రాంతంలో కలుస్తాయి?
1) దేవ ప్రయాగ 2) రుద్ర ప్రయాగ 3) రిషికేష్ 4) కరణ్ ప్రయాగ

11. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?
1) కర్ణావతి 2) భాగీరథి 3) జమున 4) పద్మ

12. కింది వాటిలో గంగానది ఒడ్డున లేని నగరం ఏది?
1) వారణాసి 2) అలహాబాద్ 3) కాన్పూర్ 4) లక్నో

13. జతపరచండి.
జాబితా-I
i) కుమవున్ హిమాలయాలు
ii) నేపాల్ హిమాలయాలు
iii) పంజాబ్ హిమాలయాలు
iv) అసోం హిమాలయాలు
జాబితా-II
a) ఇండస్, సట్లెజ్ మధ్య
b) కాళీ, తీస్తా మధ్య
c) తీస్తా, బ్రహ్మపుత్ర మధ్య
d) సట్లెజ్, కాళీ మధ్య
1) i-c, ii-d, iii-b, iv-a
2) i-c, ii-b, iii-d, iv-a
3) i-d, ii-b, iii-a, iv-c
4) i-d, ii-c, iii-a, iv-b

14. సాత్పురా, వింధ్య పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
1) నర్మద 2) గండక్ 3) తపతి 4) గోదావరి

15. భారతదేశంలో బ్రహ్మపుత్ర నది మొదట ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది?
1) అసోం 2) త్రిపుర 3) సిక్కిం 4) అరుణాచల్‌ప్రదేశ్

16. కింది వాటిలో పశ్చిమం వైపు ప్రవహిస్తున్న నది ఏది?
1) గోదావరి 2) నర్మద 3) కావేరి 4) కృష్ణ

17. నదులు, వాటి జన్మస్థానాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
1) జీలం – వెరినాగ్
2) చీనాబ్ – బారాలప్చాలా
3) రావి – రోహ్‌తంగ్ కనుమ
4) సట్లెజ్ – రూపానగర్

18. బ్రహ్మపుత్ర నది భారతదేశంలో ఏయే రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తుంది?
1) సిక్కిం, అసోం
2) అసోం, మేఘాలయ
3) అసోం, అరుణాచల్‌ప్రదేశ్
4) అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం

19. 'రెడ్ రివర్' అని ఏ నదిని పిలుస్తారు?
1) గంగా 2) కృష్ణా 3) కావేరి 4) బ్రహ్మపుత్ర

20. 'భీమ' దేనికి ఉపనది?
1) కృష్ణా 2) గోదావరి 3) నర్మద 4) కావేరి

21. గోదావరి నదికి మరో పేరు?
1) ఉత్తర గంగ 2) తూర్పు గంగ 3) దక్షిణ గంగ 4) పశ్చిమ గంగ

22. కింది వాటిలో బంగాళాఖాతంలో కలవని నది ఏది?
1) గోదావరి 2) కృష్ణా 3) తపతి 4) కావేరి

23. లక్నో నగరం ఏ నది ఒడ్డున ఉంది?
1) గోమతి 2) సట్లెజ్ 3) గంగా 4) సరయు

24. బ్రహ్మపుత్ర నది పొడవు (సుమారుగా)?
1) 1900 కి.మీ. 2) 2900 కి.మీ. 3) 3900 కి.మీ. 4) 2800 కి.మీ.

25. కింది వాటిలో గోదావరి నది ఉపనది ఏది?
1) ఇంద్రావతి 2) స్వర్ణముఖి 3) చిత్రావతి 4) కుందేరు

26. కింది వాటిలో భారతదేశంలో జన్మించని నది ఏది?
1) బియాస్ 2) చీనాబ్ 3) రావి 4) సట్లెజ్



27. జోగ్ జలపాతం ఏ నదిపై ఉంది?
1) తపతి 2) శరావతి 3) కావేరి 4) భీమ

28. వెంబనాడ్, లోక్‌తక్ సరస్సులు వరసగా ఏయే రాష్ట్రాల్లో ఉన్నాయి?
1) తమిళనాడు, రాజస్థాన్
2) కేరళ, మణిపూర్
3) కేరళ, ఒడిశా
4) ఒడిశా, రాజస్థాన్

29. ఆరావళి పర్వతాల్లో జన్మించి, కాంబే గల్ఫ్‌లోకి ప్రవహించే నది ఏది?
1) నేత్రావతి 2) లూని 3) సబర్మతి 4) తపతి

30. కింది వాటిలో 'లూని' నది దేనిలోకి ప్రవహిస్తుంది?
1) గంగాడెల్టా 2) కేరళతీరం 3) కచ్‌తీరం 4) గోదావరి డెల్టా

31. కింది వాటిలో చైనా, భారత్‌లో ప్రవహించే నది ఏది?
1) గంగ 2) యమున 3) బ్రహ్మపుత్ర 4) దామోదర్ నది

32. శ్రీనగర్ ఏ నది ఒడ్డున ఉంది?
1) రావి 2) సట్లెజ్ 3) జీలం 4) చీనాబ్

33. 'లూని' నది జన్మస్థానం ఏది?
1) సాంబార్ సరస్సు
2) అష్టముడి సరస్సు
3) లోనార్ సరస్సు
4) అన్నాసాగర్ సరస్సు

34. దేశంలోని నగరాలు, అవి ఉన్న నది తీరాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
1) అయోధ్య – సరయు
2) సూరత్ – తపతి
3) పనాజి – కావేరి
4) లుథియానా – సట్లెజ్

35. కావేరి నది ఏయే రాష్ట్రాల్లో ప్రవహిస్తోంది?
1) ఆంధ్రప్రదేశ్, తమిళనాడు
2) కర్ణాటక, ఆంధ్రప్రదేశ్
3) ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర
4) కర్ణాటక, తమిళనాడు

36. అమరావతి నది ఏ నదికి ఉపనది?
1) కావేరి 2) కృష్ణా 3) పెన్నా 4) గోదావరి

37. కింది వాటిలో సరికానిది ఏది?
1) నర్మదా నది అమర్ కంటక్ వద్ద జన్మిస్తోంది
2) తపతి నది ముల్తాయి వద్ద జన్మిస్తోంది
3) తుంగభద్ర నది నందిదుర్గ కొండల్లో జన్మిస్తోంది
4) మహానది ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం లోని 'శిహావా' ప్రాంతంలో జన్మిస్తోంది

38. తోచి, గిల్గిట్, హుంజా అనేవి ఏ నదికి ఉపనదులు?
1) సింధూ 2) యమున 3) గంగ 4) బ్రహ్మపుత్ర

39. నాసిక్ నగరం ఏ నది ఒడ్డున ఉంది?
1) గోమతి 2) గోదావరి 3) నర్మద 4) తపతి

40. కింది వాటిలో ఏ నది ప్రఖ్యాతి చెందిన 'మార్బుల్ ఫాల్స్'గా తయారవుతోంది?
1) నర్మద 2) తపతి 3) శరావతి 4) కావేరి

41. భారతదేశంలో ఏ నది వల్ల ఎక్కువగా వరదలు సంభవిస్తాయి?
1) గోదావరి 2) గోమతి 3) బ్రహ్మపుత్ర 4) కావేరి

42. కింది వాటిలో ఏ నదీతీరం అత్యధిక నీటి పరీవాహక ప్రాంతాన్ని కలిగి ఉంది?
1) గంగ 2) బ్రహపుత్ర 3) యమున 4) గోదావరి

43. కింది వాటిలో సరికానిది ఏది?
1) కోల్‌కతా – హుగ్లీ
2) మధురై – కావేరి
3) ఢిల్లీ – యమున
4) రూర్కెలా – బ్రాహ్మణి

44. అసోంలో ఏ నది వల్ల తీవ్ర వరదలు సంభవిస్తాయి?
1) గోమతి 2) గంగ 3) బ్రహ్మపుత్ర 4) యమున

45. బ్రహ్మపుత్ర నది జన్మస్థానం ఏది?
1) గంగోత్రి 2) పశ్చిమ కనుమలు
3) టిబెట్ పీఠభూమి
4) పూర్వాంచల్ పర్వతాలు

46. చిత్రావతి ఏ నదికి ఉపనది?
1) పెన్నా 2) గోదావరి 3) కృష్ణా 4) తుంగభద్ర

47. కెన్ నది జన్మస్థానం ఏది?
1) బందార్ పుంచ్ శిఖరం
2) జనపావో కొండలు
3) వరాహా పర్వతాలు
4) కైమూర్ కొండలు

48. కింది వాటిలో సరికానిది ఏది?
1) కెన్‌నదిని 'కర్ణావతి' అని పిలుస్తారు
2) వంశధార నదిని 'లాంగుల్యా' అని పిలుస్తారు
3) గండక్‌నదిని బిహార్‌లో 'నారాయణి' అని పిలుస్తారు
4) బ్రహ్మపుత్ర నదిని బంగ్లాదేశ్‌లో 'జమున' అని పిలుస్తారు

49. పూర్ణ, బేతుల్, పాట్కి అనేవి ఏ నదికి ఉపనదులు?
1) మహానది 2) పెన్నా 3) తపతి 4) నర్మద

50. 'నాక్' సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
1) మహారాష్ట్ర 2) రాజస్థాన్ 3) గుజరాత్ 4) జమ్ము-కశ్మీర్

51. కింది వాటిలో సరికానిది ఏది?
1) గౌహతి – బ్రహ్మపుత్ర
2) జంషెడ్‌పూర్ – సువర్ణరేఖ
3) శ్రీరంగపట్నం – పెన్నా నది
4) కటక్ – మహానది

52. బరాకర్, కోనార్ ఏ నదికి ఉపనదులు?
1) మహానది 2) దామోదర్ 3) యమున 4) సబర్మతి

53. కింది వాటిలో ఏ నదిని 'నేత్రావతి' అని పిలుస్తారు?
1) బెట్వా 2) చంబల్ 3) కోసి 4) యమున

54. చంబల్, బెట్వా, కెన్‌లు ఏ నదికి ఉపనదులు?
1) నర్మద 2) తపతి 3) యమున 4) దామోదర్

55. కింది వాటిలో పెన్నా నదికి ఉపనది కానిది ఏది?
1) కుందేరు 2) సగిలేరు 3) లోకపావని 4) చెయ్యేరు

56. సోన్ నది గంగానదిలో ఎక్కడ కలుస్తుంది?
1) అలహాబాద్ 2) పాట్నా 3) రుద్ర ప్రయాగ 4) చాప్రా

57. నర్మదానది దేశంలో ఏయే రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తోంది?
1) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
2) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్
3) మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
4) మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్

58. దిబాంగ్, లోహిత్ ఏ నదికి ఉపనదులు?
1) గంగా 2) సింధూ 3) యమున 4) బ్రహ్మపుత్ర

59. గంగా నది ఏ రాష్ట్రంలో అత్యధిక దూరం ప్రవహిస్తోంది?
1) పశ్చిమ బెంగాల్ 2) ఉత్తరప్రదేశ్ 3) బిహార్ 4) ఉత్తరాఖండ్

60. కింది వాటిలో సరైంది ఏది?
1) దామోదర్ నది చోటానాగ్‌పూర్ పీఠభూమిలోని 'టోరి' అనే ప్రాంతంలో జన్మిస్తోంది
2) చంబల్ నది మధ్యప్రదేశ్‌లోని 'మౌ' అనే ప్రదేశంలో జన్మిస్తోంది
3) పెన్నా నది కర్ణాటకలో నంది దుర్గ కొండల్లో జన్మిస్తోంది
4) పైవన్నీ సరైనవే

సమాధానాలు

1) 4	2) 3	3) 3	4) 2	5) 4
6) 2	7) 3	8) 4	9) 4	10) 1
11) 4	12) 4	13) 3	14) 1	15) 4
16) 2	17) 4	18) 3	19) 4	20) 1
21) 3	22) 3	23) 1	24) 2	25) 1
26) 4	27) 2	28) 2	29) 3	30) 3
31) 3	32) 3	33) 4	34) 3	35) 4
36) 1	37) 3	38) 1	39) 2	40) 1
41) 3	42) 1	43) 2	44) 3	45) 3
46) 1	47) 4	48) 2	49) 3	50) 3
51) 3	52) 2	53) 1	54) 3	55) 3
56) 2	57) 3	58) 4	59) 2	60) 4

What is the percentage earning..



N. Vinaykumar Reddy
Director, IACE,
Hyderabad.

Model Questions

Directions (Q.No. 1 - 5) In each of these questions two equations are given. You have to solve these equations and give answer.

a) If $x < y$ b) If $x > y$
c) If $x = y$ d) If $x \geq y$
e) If $x \leq y$

1. I. $x(x + 7) = 30$
 II. $y = \left(\frac{100}{9}\right)^{1/2}$
2. I. $3x^2 - 16x + 21 = 0$
 II. $6y^2 + 25y + 21 = 0$
3. I. $2x^5(x^{-2}) = 128$
 II. $\frac{1}{3}y^9 = \frac{1}{24}y^{11}$
4. I. $20x^2 - 108x + 144 = 0$
 II. $25y^2 - 90y + 72 = 0$
5. I. $2x^2 + 18x + 36 = 0$
 II. $y^2 - 3y - 18 = 0$
6. Ram sold an article with 2.5% loss. If he sold it 100/- more then Ram get 7.5% profit. What will be the selling price of article if Ram wants to earn 12.5% profit?
 a) 1200 b) 1000
 c) 1205 d) 1125
 e) None of these
7. A takes 4 days to complete $1/3^{rd}$ of a job. B takes 3 days to complete $1/6^{th}$ of the same work and C takes 5 days to complete half of the job. If all of them work together for 3 days and A & C quit, how long will it take for B to complete the remaining work done?
 a) 6 days b) 8.1 days
 c) 5.1 days d) 7 days
 e) None of these
8. Arun borrowed a sum of money from Jayant at the rate of 8% per annum simple interest for the first four years, 10% per annum for the next 6 years and 12% per annum for the period beyond 10 years. If he pays a total of Rs. 12160 as interest only at the end of 15 years, how much money



IBPS RRB Special
Quantitative Aptitude

did he borrow?
 a) Rs. 8000
 b) Rs. 10000 c) Rs. 12000
 d) Rs. 9000
 e) None of these
9. Kalyani took a loan at simple interest rate of 6% in the first year with an increase of 0.5 % in each subsequent year. She paid interest of Rs. 3375 after 4 years. How much loan did she take?
 a) Rs. 15000
 b) Rs. 12500 c) Rs. 16000
 d) Rs. 12000
 e) None of these
10. Peter earned 50% more than sum of Ravi and Rajesh whereas Rajesh earnings are one third of that of Peter. What is the percentage earning of Ravi more than Rajesh?
 a) 10% b) 15%
 c) 50% d) 0%
 e) 100%
11. In one litre of mixture of alcohol and water, water is 30%. The amount of alcohol that must be added to the mixture, so that the part of water in the mixture becomes 15%, is:
 a) 1000 ml b) 700 ml
 c) 300 ml d) 900 ml
 e) None of these
12. A box contains 2 blue caps, 4 red caps, 5 green caps and 1 yellow cap. If one cap is picked at random, what is the probability that it is either blue or yellow?
 a) $\frac{2}{9}$ b) $\frac{1}{4}$
 c) $\frac{3}{8}$ d) $\frac{6}{11}$
 e) None of these
13. A and B enter into a partnership with their capitals in the ratio 3 : 5. At the end of 4 months, A withdraws his capital. If they receive the profits in the ratio 4 : 5, find how long B's capital was used?
 a) 2 months
 b) 5 months c) 4 months
 d) 3 months
 e) None of these
14. The cost price of article B is 20% more than that of article A. Articles A and B were marked up by 50% and 25% respectively. Article A was sold at discount of 5% and article B was sold at a discount of 9%. If the selling price of article A was Rs. 30/- more than the selling price of article B, what was the cost price of article A?
 a) Rs. 600/- b) Rs. 400/-
 c) Rs. 500/- d) Rs. 540/-
 e) None of these


Directions (Q. No. 15-19) : What should came in place of the question mark (?) in the following number series?

15. 6, 7, 16, 51, 208, ?, 6276
 a) 1045 b) 941
 c) 836 d) 1254
 e) None of these
16. 3, 5, 8, 12, 17, ?, 30
 a) 25 b) 27
 c) 22 d) 24
 e) None of these
17. 1, 8, 27, 64, ?, 216, 343
 a) 145 b) 160
 c) 125 d) 180
 e) None of these
18. 4, 6, 12, ?, 90, 315, 1260
 a) 42 b) 36
 c) 24 d) 30
 e) None of these
19. 18, 21, 16, 23, 12, 25, ?
 a) 24 b) 8
 c) 14 d) 10
 e) None of these

Key & Solutions

1. I. $x^2 + 7x - 30 = 0$
 $x^2 + 10x - 3x - 30 = 0$
 $x(x + 10) - 3(x + 10) = 0$
 $x = -10, 3$
 II. $y = \sqrt{\frac{100}{9}} = \frac{10}{3} = 3.33$
 Hence, $x < y$ ***Ans: a***
2. I. $3x^2 - 16x + 21 = 0$
 $3x^2 - 9x - 7x + 21 = 0$
 $(3x - 7)(x - 3) = 0$
 $x = 3, \frac{7}{3}$
 II. $6y^2 + 25y + 21 = 0$
 $6y^2 + 18y + 7y + 21= 0$
 $y = -\frac{7}{6}, -3$
 Hence, $x > y$ ***Ans: b***
3. I. $2x^5 (x^{-2}) = 128$
 $2x^3 = 128$
 $x = 4$
 II. $y^9 = \frac{y^{11}}{8}$
 $8 = y^2$
 $y = 2\sqrt{2}$
 Hence, $x > y$ ***Ans: b***
4. I. $20x^2 - 108x + 144 = 0$
 $20x^2 - 60x - 48x + 144 = 0$
 $20x (x - 3) - 48(x - 3) = 0$
 $x = 3, 2.4$
 II. $25y^2 - 90y + 72 = 0$
 $25y^2 - 60y - 30y + 72 = 0$
 $5y (5y - 12) - 6(5y - 12) = 0$
 $y = 2.4, 1.2$
 Hence, $x \geq y$ ***Ans: d***
5. I. $2x^2 + 18x + 36 = 0$
 $x^2 + 9x + 18 = 0$
 $x^2 + 6x + 3x + 18 = 0$
 $x(x + 6) + 3(x + 6) = 0$
 $x = -6, -3$
 II. $y^2 - 3y - 18 = 0$
 $y^2 - 6y + 3y - 18 = 0$
 $y(y - 6) + 3(y - 6) = 0$
 $y = 6, -3$
 Hence, $x \leq y$
 Ans: e
6. $\frac{107.5}{100}C - \frac{97.5}{100}C = 100$
 ∴ C = 1000
 ∴ Selling price
 $= \frac{112.5}{100} \times C \Rightarrow \frac{112.5}{100} \times 1000 \Rightarrow 1125$
 Ans: d
7. A ⇒ $\frac{1}{3}^{rd}$ work in 4 days
 A ⇒ total work in
 3 × 4 = 12 days.
 B ⇒ $\frac{1}{6}$th work in 3days
 B ⇒ total work in
 6 × 3= 18 days
 C ⇒ half the work in 5 days
 C ⇒ total work in
 2 × 5 = 10 days
 LCM of 12, 18, 10 is 180 units
 A's 1 day's work = 15 units
 B's 1 day's work = 10 units
 C's 1 day's work = 18 units
 A, B and C's 3 day's work = 3 (15 + 10 + 18) = 129 units
 Remaining work = 180 – 129 = 51 units
 B completes the remaining work in 5.1 days.
 Ans: c
8. (4 years) (6 years) (5 years)
 8 × 4 + 10 × 6 + 12 × 5
 32 + 60 + 60 = 152%
 152% ⇒ 12,160
 Principle ⇒ 100%
 $= 12160 \times \frac{100}{152} = 8000$
 Ans: a
9. Total interest % = 6 + 6.5 + 7 + 7.5 = 27%
 ∴ 27% ⇒ 3375
 Principle ⇒ 100%
 $= \frac{3375 \times 100}{27} = 12500$
 Ans: b
10. Peter $= \frac{150}{100}(\text{Ravi} + \text{Rajesh}) \rightarrow (1)$
 Rajesh $= \frac{\text{Peter}}{3} \rightarrow (2)$
 By substituting eq. (2) in (1)
 3Rajesh = 1.5 Ravi +1.5 Rajesh
 1.5 Ravi = 1.5 Rajesh
 Ravi = Rajesh
 Their earnings are equal.
 Ans: d
11. In 1000 ml of mixture
 Alcohol = 700 ml
 Water = 300 ml
 Let x ml of alcohol is mixed
 According to question
 $= \frac{300}{1000 + x} \times 100 = 15 \Rightarrow x = 1000\text{ml}$
 Ans: a
12. 2B, 4R, 5G, 1Y
 $P(B \text{ or } Y) = \frac{2C_1}{12C_1} + \frac{1C_1}{12C_1} = \frac{2}{12} + \frac{1}{12}$
 $= \frac{3}{12} \Rightarrow \frac{1}{4}$
 Ans: b
13. A : B
 3 × 4 : 5 × t
 Profit ratio $= \frac{4}{5}$
 $\Rightarrow \frac{12}{5t} = \frac{4}{5}$
 t = 3 months ***Ans: d***
14. Let the cost price of article A = Rs. x
 Cost price of article
 $B = x \times \frac{120}{100} = \frac{6x}{5}$
 Marked price of article
 $A = x \times \frac{150}{100} = \frac{3x}{2}$
 Marked price of article
 $B = \frac{6x}{5} \times \frac{125}{100} \Rightarrow \frac{3x}{2}$
 According to question,
 $\frac{3x}{2} \times \frac{95}{100} - \frac{3x}{2} \times \frac{91}{100} = 30$
 $\frac{3}{2}x \times \frac{4}{100} = 30$
 ∴ x = Rs.500/- ***Ans: c***
15. 6 7 16 51 208 **?=1045** 6276
 (+1)×1 (+1)×2 (+1)×3 (+1)×4 (+1)×5 (+1)×6
 ∴ ? = (208 + 1) × 5 = 1045
 Ans: a
16. 3 5 8 12 17 **? = 23** 30
 +2 +3 +4 +5 +6 +7
 ∴ ? = 17 + 6 = 23 ***Ans: e***
17. $1 \Rightarrow 1^3$, $8 \Rightarrow 2^3$, $27 \Rightarrow 3^3$,
 $64 \Rightarrow 4^3$, $? = 5^3 \Rightarrow 125$
 $216 \Rightarrow 6^3$, $343 \Rightarrow 7^3$
 ∴ $? = 5^3 = 125$ ***Ans: c***
18. 4 6 12 **?=30** 90 315 1260
 ×1.5 ×2.0 ×2.5 ×3.0 ×3.5 ×4
 ∴ ? = 12 × 2.5 = 30
 Ans: d
19. 18 21 16 **23** 12 25 ?=8
 +3 -5 +7 −11 +13 −17
 Here 3, 5, 7, 11, 13, 17 are prime numbers
 ∴ ? = 25 – 17= 8 ***Ans: b***

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి





నాన్నా చెప్పవా?

ఒంటె పాలను తాగవచ్చా?



ఆవుల పాలకన్నా ఒంటె పాలు పుష్టిని, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. అందుకే ఒంటెలను పెంచే ప్రాంతాలలో చాలా మంది తమ పిల్లలకు ఒంటె పాలను తాగిస్తుంటారు. ఆవు పాలతో పోల్చినప్పుడు ఒంటె పాలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఒంటెలు ఎడారుల వంటి చాలా కఠోరమైన పరిసరాలలో జీవించే కారణంగా అవి తమ సంతానం కోసం అనేకవిధాలుగా మేలు చేసే పాలను ఉత్పత్తి చేసి అందిస్తాయి. ఆవుపాలు కేవలం 12 గంటలలోనే పులిసిపోతే ఒంటె పాలు మాత్రం రెండు రోజులపాటు (48 గంటలు) పాడవకుండా ఉంటాయి. రుచిలో ఆవుపాల కొంచెం ఉప్పగా ఉండే ఒంటె పాలు పోషకాల విషయంలో మాత్రం చాలా సుసంపన్నంగా ఉంటాయి. ఆవుపాలలోకన్నా ఒంటె పాలలో సి–విటమిను 3 రెట్లు ఎక్కువగాను, ఇనుము 10 రెట్లు ఎక్కువగాను ఉంటాయి. అదేవిధంగా ఆరోగ్యకరమైన ఆమ్లాలు బి–విటమిన్ కూడా ఒంటె పాలలో పుష్కలంగాఉంటాయి. వ్యాధి కారక సూక్ష్మజీవులకు, వైరస్‌లకు వ్యతిరేకంగా పని చేసే స్వభావం ఆవుపాలలోకన్నా ఒంటె పాలలో పది రెట్లు ఎక్కువగా ఉంటుంది. అయితే ఆవుపాలలో కొవ్వు శాతం 4.5% ఉంటే ఒంటె పాలలో అది కేవలం 2% మాత్రమే ఉంటుంది. ఇలా ఒక పక్క వివిధ పోషకాలను, విటమిన్లను పుష్కలంగా కలిగి ఉంటూ మరోపక్క హానికారకమైన కొవ్వులాంటి పదార్థాలు తక్కువగా ఉండే కారణంగా డయాబెటిస్, గుండె జబ్బులు వంటివి ఉన్న వారికి గతంలో పోషకాహార లోపంతో శరీరం క్షీణించిన వారికి, రోగ రోధక శక్తి తక్కువగా ఉండి అది పెంచుకోవలసిన అవసరం ఉన్న వారికి ఒంటెపాలు చాలా మంచివని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు. కొన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు ... జీర్ణకోశంలో వచ్చే గడ్డలు, ఇతర అపసవ్యతలు, జలుబు, క్షయ, ఉబ్బసం, రికెట్స్, హెపటైటిస్ వంటి పలు రుగ్మతలను నయం చేసుకునేందుకు ఒంటెపాలను ఓ చక్కటి ఔషధంలా వాడుకుంటారు.

మీకు తెలుసా?

మిడత వెనకకాళ్లను తరుచూ తడిమితే మనతో స్నేహం చేస్తుంది



బ్రిటన్‌లో 90% జనాభా వారంలో కనీసం ఒక్కసారైన పిజ్జా తింటారు



1939లో సంభవించిన ఒక్క ఉరుముతోనే 835 గొర్రెలు చనిపోయాయి




నీడలను గుర్తించండి


పైన కొన్ని బొమ్మలు ఉన్నాయి. కింద వేరు వేరు స్థానాల్లో వాటి నీడలు ఉన్నాయి. ఏ బొమ్మ నీడ దేనిదో గుర్తించి బొమ్మలతో వాటి నీడలను జతచేయండి.




లెక్కించండి.. రంగులు వేయండి

ఇక్కడ ఉన్న బొమ్మల్లో ఏవి ఎన్ని ఉన్నాయో లెక్కించి, కింద రంగులలో ఇచ్చిన బొమ్మల దగ్గర రాయండి. అన్నిటికీ కింద ఇచ్చిన మాదిరిగా రంగులు వేయండి.





కింద ఇచ్చిన ఏనుగు బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



•అల కల్లోలం



ఉప్పాడ సమీపంలో సుబ్బంపేట వద్ద రక్షణ గోడను దాటి ఎగసిపడుతున్న కెరటాలు



బీచ్‌రోడ్డులో వాహనాలపై విరుచుకుపడుతున్న కెరటాలు

పిఠాపురం :

సూర్య గ్రహణం, అమావాస్య కలిసి రావడంతో పాటు బంగాళాఖాతం లో అల్పపీడన ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. సుమారు 10 మీటర్ల మేరా ఎత్తున ఎగిసిపడుతున్న కెరటాలు బీచ్‌రోడ్డును ధ్వంసం చేస్తుండగా తీర ప్రాంతాన్ని తీవ్ర కోతకు గురిచేస్తున్నాయి. భయంకరంగా ఎగిసిపడుతున్న కెరటాలు బీచ్‌రోడ్డును ముంచెత్తుతుండడంతో ఆరోడ్డుపై వాహనాలు ప్రమాద స్థితిలో ప్రయాణిస్తున్నాయి. ఉప్పాడకు రక్షణగా వేసిన జియో ట్యూబ్ రక్షణ గోడను సైతం దాటుకుని సముద్రం ఉప్పొంగడంతో ఉప్పాడ శివారు పల్లిపేట, మాయాపట్నం తదితర ప్రాంతాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకు రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సముద్ర కెరటాల ఉధృతితో బీచ్‌రోడ్డు సుమారు 3 కిలో మీటర్ల మేరా కోతకు గురయ్యింది. మంగళవారం ఉదయం నుంచి సముద్ర కెరటాల ఉధృతి తీవ్ర రూపం దాల్చింది. మంగళవారం రాత్రికి కెరటాల ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండడంతో తీరప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు.


జర్నలిస్టులపై 'నిజమ్' లఘు చిత్రం



అమలాపురంలో చిత్రీకరిస్తున్న నిజమ్...జర్నలిజమ్ లఘు చిత్రంలోని ఓ సన్నివేశం

అమలాపురం టౌన్ : నేటి సమాజంలో జర్నలిస్టుల పాత్ర, ప్రాధాన్యతను ప్రతి బింబిస్తూ నిజమ్ పేరుతో అమలాపురం పరిసర ప్రాంతాల్లో లఘు చిత్రం చిత్రీకరణ మంగళవారం జరిగింది. నిజమ్...జర్నలిజమ్ ఉప శీర్షికతో చిత్రీకరణ సాగుతోంది. ఆ లఘు చిత్రం దర్శకుడు శ్రీనివాస్ సూర్య మాట్లాడుతూ అమలాపురంలో జర్నలిస్టుగా ఉన్న తాను చిత్ర సీమలో తన కున్న కొద్దిపాటి అనుభవంతో ఆ లఘు చిత్రాన్ని నిర్మిస్తున్నానని చెప్పారు. 20 నిమిషాల నిడివితో ఉండే ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామన్నారు. లఘు చిత్రం కోసం తాను రాసిన గీతాన్ని సినీ వర్ధమాన గాయకుడు ధనుంజయ్ (గోపాల గోపాల ఫేం) ఆలపించడం తనకు మంచి అనుభూతిని ఇచ్చిందన్నారు. శ్రీనివాస క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మాస్టర్ షణ్ముఖ్ విఘ్నేష్ నిర్మించగా హీరోగా సూర్య, ప్రతి నాయకునిగా నూకల షణ్ముఖరావు, ప్రధాన పాత్రల్లో మట్టా గోవింద రావు, శ్రీధర్ రాజులపూడి, కంచిపల్లి అబ్బులు నటిస్తున్నారని దర్శకుడు శ్రీనివాస్ సూర్య తెలిపారు.

అయినవిల్లి వినాయకుడు చవితికి ముస్తాబు



అయినవిల్లి : అయినవిల్లి విఘ్నేశ్వరుడు చవితికి ముస్తాబవుతున్నాడు. నవరాత్రి మహోత్సవాలకు ఆలయం వద్ద బారికేడ్లు, చలువ పందిళ్లు నిర్మించారు. విద్యుత్ దీపాలతో దేవతల ఆకృతులను తీర్చిదిద్దారు. ఆలయ ప్రాకారానికి, గోపురాలకు రంగులు అద్దారు. భక్తులకు రద్దీకి అనుగుణంగా సర్వ సౌకర్యాలు కల్పించారు. చవితి ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రావిపాటి సుబ్బరాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు. నవరాత్రులు సందర్భంగా స్వామిని 5 లక్షల మంది భక్తులు పైగా స్వామివారిని దర్శించవచ్చునని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. చవితి మొదటి రోజున స్వామివారికి సీజనల్ పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాలతో అభిషేకం, లక్షదూర్వార్చన, లక్ష్మీగణపతిహోమం నిర్వహిస్తామన్నారు. భక్తులకు రవ్వలడ్డు, పులిహోర ప్రసాదం అందించనున్నారు.

తూర్పుగోదావరి | బుధవారం | ఆగస్టు | 23 | 2017 సాక్షి



పాఠ్య శిల్పులు

- ఆదర్శంగా మన ఉపాధ్యాయులు
- పుస్తకాల రూపకల్పనలో ఘనాపాఠీలు


అంగర గోపాలకృష్ణమాచార్యులు


చిలుకూరి శ్రీనివాసరావు


కత్తుల వెంకటేశ్వరరావు


షేక్ బ్రహ్మాజీషా


తోటకూర సాయిరామకృష్ణ

రాయవరం (మండపేట):

మనం ఎన్నో పుస్తకాలను చదువుతాం. కానీ ఆ పుస్తకాలను రాసిందెవరో పెద్దగా పట్టించుకోం. కానీ మన ముందర నిత్యం కనిపించే పుస్తకాలను రాసిన వారు మనకు తెలిసిన వారే అయితే! మనకు గర్వ కారణం కదూ. రేపటి పౌరుల కోసం రూపొందించిన పుస్తకాలను రాసిన వారిలో మన జిల్లా ఉపాధ్యాయులు, పాఠ్య పుస్తక రచనలో వారి కృషిపై ఈ కథనం.

తెలుగు వెలుగులు..

2,3,4,5 తరగతి తెలుగు వాచకం తయారీలో ముగ్గురు ఉపాధ్యాయులు మన జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఒకరు పెదపూడి మండలం కుమారప్రియం ఎంపీపీపీ పాఠశాలకు చెందిన అంగర గోపాలకృష్ణమాచార్యులు. ఈయన చందమామ రావే, సరదా సరదా పదాలు, సరదా సరదా వేషాలు, విద్యా కిరణాలు, పిల్లల ప్రపంచంలో కథలు రాశారు. ఎస్ఎస్ఏ, ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించే మాడ్యూల్స్ రూపకల్పనలో కూడా పాల్గొన్నారు.

కడియం మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలకు చెందిన చిలుకూరి శ్రీనివాసరావు తెలుగు, పరిసరాల విజ్ఞానం పాఠ్య పుస్తక రచనలో పాల్గొన్నారు. శ్రీనివాసరావు పంపిన వ్యాసాలు, ఎస్ఎస్ఏ ప్రచురించిన మాసపత్రిక చందమామ రావే, విద్యాగౌతమిలో చేసిన రచనలకు అవకాశం దక్కింది. మూడో తరగతిలో పరిసరాల విజ్ఞానం పాఠ్య పుస్తకంలో ఇంటి పేర్లు ఎలా వస్తాయి, నాలుగో తరగతిలో మన చుట్టూ ఉండే మొక్కలు పాఠంలో కడియం నర్సరీలు, ఐదో తరగతిలో మన గోదావరి పాఠంలో పులసలు పాఠం, ఆరో తరగతి సైన్సు పుస్తకంలో బోన్సాయ్ మొక్కలు పాఠాలను రూపొందించారు.

వెంకటేశ్వరరావు అంబాజీపేట మండలం ముక్కామల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 4,5 తెలుగు పాఠ్య పుస్తక రచనల్లో పాల్గొన్నారు. తెలుగు భాషకు ఎస్ఆర్‌పీగా పనిచేసిన వెంకటేశ్వరరావు 4,5 తరగతి పాఠ్య పుస్తక రచనల రూపకల్పనలో పాల్గొన్నారు. అన్నం, మనజెండా పాఠ్యాంశాల రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు.

షేక్ బ్రహ్మాజీషా రాయవరం మండలం చెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. మూడో తరగతి పరిసరాల విజ్ఞానం పాఠ్య పుస్తక రూపకల్పనలో పాలుపంచుకున్నారు. ప్రయాణ సాధనాలు పాఠ్యాంశం రూపకల్పన చేశారు.

గణితం పుస్తక రూపకల్పనలో..

పెద్దాపురం ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న తోటకూర సాయిరామకృష్ణ 3,4,5 తరగతుల గణితం పాఠ్య పుస్తక తయారీలో తన వంతు పాత్రను పోషించారు.

సర్వేశ్వరశర్మ..

అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఫిజిక్స్ రీడర్‌గా పనిచేసి రిటైర్ అయిన సర్వేశ్వరశర్మ పుస్తక రచయితగానే కాకుండా ఎడిటింగ్‌లో పాల్గొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయన వినియోగించుకోవడం గమనార్హం. భారతదేశం–అంతరిక్షం అనే పాఠ్యాంశాన్ని సర్వేశ్వరశర్మతో రాయించుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం వారి పాఠ్య పుస్తకంలో ప్రచురించింది.

ప్రతిభ ఆధారంగానే..

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ) నూతన పాఠ్య పుస్తకాల తయారీకి 2011 జూన్‌లో నోటిఫికేషన్ విడుదల చేసింది. నిరంతర సమగ్ర మూల్యాంకన విధానం(సీసీఈ)లో పాఠ్య పుస్తకాలను రూపొందించేందుకు ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పుస్తకాల మార్పు అవసరమా..? అయితే ఎలా ఉండాలి, వివరాలను విశ్లేషిస్తూ ఒక వ్యాసం, ఇంకా పలు ప్రశ్నలతో ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరింది. రాష్ట్ర వ్యాప్తంగా 15వేల మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేయగా, అందులో దక్కని సలహాలతో పాటు, పరిశీలకుల గుర్తించిన ప్రతిభ ఆధారంగా వీరిని ఎంపిక చేశారు.

స్వచ్ఛంద సేవకు ప్రతిరూపం


అన్నవరం దేవస్థానం ఉచితాసుపత్రి

- 76 ఏళ్ల వయసులో అలుపెరగని వైద్యసేవలు
- ఇకపై అన్నవరం ఆస్పత్రిలోనూ వైద్యం
- అనపర్తికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శ్రీలక్ష్మి

డెబ్బైఆరు సంవత్సరాల పండు వయసులో కూడా ఏమాత్రం అలసట లేకుండా పనిచేస్తున్న తీరు చూపరులకు ఆశ్చర్యం కలిగించకమానదు. వైద్యాన్ని వృత్తిగానే కాకుండా సేవగా భావించి పేద రోగుల పాలిట దైవంగా ఆమె మన్ననలు అందుకుంటున్నారు. ఆమె అనపర్తికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీలక్ష్మి. ఇకపై సత్యదేవుని సన్నిధిలో కూడా తన వైద్య సేవలు అందించడానికి సంకల్పించారు.


మహిళను పరీక్షించి మందులిస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి

అన్నవరం (ప్రత్తిపాడు) :

అన్నవరంలోని దేవస్థానం ఆస్పత్రికి మంచి రోజులొచ్చాయి. వైద్యాధికారి సమయానికి రాక, మందులు లేక ఇప్పటి వరకూ ఈ ఆస్పత్రి 'విగ్రహం పుష్టి– వైద్యం నష్టి' అనే సామెతకు నకలుగా ఉంది. అయితే దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కోరిక మేరకు అనపర్తికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీలక్ష్మి దేవస్థానం ఆస్పత్రిలో మహిళా వైద్యాధికారిగా సేవలందించనున్నారు. దేవస్థానం వసతి, మందులు సమకూర్చితే వారానికి ఐదు రోజులు అన్నవరం ఆస్పత్రిలోనే రోగులకు సేవలందించేందుకు ఆమె అంగీకరించారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో ముచ్చటించారు.

దైవ సన్నిధిలో వైద్య సేవలందించాలని...

శ్రీసత్యదేవుని సన్నిధిలో వైద్యసేవలందించాలని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కోరగా వెంటనే అంగీకరించానని డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం శని, ఆదివారాలలో రోగులకు సేవలందించాలని నిర్ణయించానన్నారు. తాను పలు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నందున కొన్ని రకాల మందులు తన వద్ద ఉన్నాయని, వాటిని ఉచితంగా రోగులకు అందచేస్తున్నామని తెలిపారు.

మహిళలకు సంబంధించిన వివిధ రోగాలను పరీక్షించి మందులివ్వడంతో బాటు ఛాతి కేన్సర్, గర్భాశయ సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తానని తెలిపారు.


రోగులకు పంపిణీ చేసేందుకు తెచ్చిన మందులు

వీటిపై అంగన్‌వాడీలు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తానని తెలిపారు.

వసతులు కల్పిస్తే ఐదు రోజులు సేవలు

డాక్టర్ శ్రీలక్ష్మి ప్రస్తుతం అనపర్తి నుంచి వచ్చి వైద్యసేవలందించి తిరిగి అనపర్తి వెడుతున్నారు. దేవస్థానం అధికారులు తమకు వసతి సౌకర్యాలు కల్పించి అన్ని రకాల మందులు అందచేస్తే వారానికి ఐదు రోజులు ఇక్కడే ఉండి సేవలందిస్తామని ఆమె తెలిపారు. ఆమె భర్త జగన్నాథరావు, ఆమె నర్సింగ్‌హోంకి చెందిన మరో ఇద్దరు సిబ్బంది ఆమెతో బాటు సేవలందిస్తున్నారు.


దేవస్థానం వైద్యసిబ్బందితో డాక్టర్ శ్రీలక్ష్మి

అన్ని సదుపాయాలు కల్పిస్తాం : ఇన్‌ఛార్జి ఈఓ

అన్నవరం ఆస్పత్రిలో వైద్యసేవలు అందించడానికి డాక్టర్ శ్రీలక్ష్మి ఏ సదుపాయాలు కోరినా ఏర్పాటు చేస్తామని దేవస్థానం ఇన్‌ఛార్జి ఈఓ ఈరంకి జగన్నాథరావు తెలిపారు. ప్రస్తుతం రెండ్రోజులు మాత్రమే పనిచేస్తానన్నారని, ఆ మేరకు సహజ ఆస్పత్రి భవనంలో బస ఏర్పాట్లు చేశామని తెలిపారు.

వైద్యవృత్తికే అంకితం...

మెడిసిన్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేసిన డాక్టర్ శ్రీలక్ష్మి వైద్యవృత్తిని స్వచ్ఛంద సేవకు మార్గంగా చేసుకుని రాష్ట్రంలోని ఎన్నో ప్రాంతాల్లో తన సేవలు అందించారు. 1955లో గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేసిన ఆమె గుంటూరు మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో ట్యూటర్ కం సివిల్ సర్జన్‌గా పనిచేశారు. విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో గైనకాలజీ స్పెషల్ సబ్జెక్ట్‌గా పీజీ చేశారు. 1966లో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో డీజీఓ పరీక్షల్లో ప్రథమస్థానం పొంది అప్పటి రాష్ట్రపతి వీవీ గిరి చేతుల మీదుగా బంగారు పతకం పొందారు. అక్కడే ఎండీ కూడా చేశారు. భర్త జగన్నాథరావుకు ఐఎల్‌టీడీ అనపర్తికి బదిలీ కావడంతో ప్రభుత్వ ఉద్యోగం వదిలి అనపర్తిలో నర్సింగ్‌హోం నెలకొల్పి సేవ చేశారు. అప్పటి నుంచి ఆమె అటు నర్సింగ్ హోంలో సేవలందిస్తూనే రాష్ట్రంలో పలు చోట్ల మెగా వైద్య శిబిరాలు నిర్వహించి సేవ చేశారు. ప్రధానంగా జిల్లా ఏజెన్సీలో ఆమె గిరిజనులకు చేసిన వైద్యసేవలకు మెచ్చి ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సంస్థలు పలు అవార్డులు అందచేశాయి.

సాక్షి తూర్పుగోదావరి | బుధవారం | ఆగస్టు | 23 | 2017

సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు రమణ, కలెక్టర్ కార్తికేయ మిశ్రా, ఎస్పీ విశాల్ గున్ని



నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించండి
- రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎన్నికల పరిశీలకుడు రమణ

కాకినాడ సిటీ :

ప్రశాంత వాతావరణంలో కార్పొరేషన్ ఎన్నికలు జరిగేందుకు అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని ఎన్నికల పరిశీలకులు కేవీ రమణ కోరారు. కలెక్టరేట్ కోర్టు హాల్లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 29న జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్నికల నియమావళి ప్రకారం నడచుకోవాలని హెచ్చరించారు. ఎన్నికల ఫిర్యాదుల స్వీకరణ కోసం 0884–2376051 నంబర్‌తో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే 8247511459 పరిశీలకుని నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోలింగ్ స్టేషన్లలో వినియోగించే రిజర్వుతో సహా 398 బ్యాలటింగ్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను (ఈవీఎం) సిద్ధం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ అలీంభాషా తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలకనుగుణంగా పాత డేటాను తొలగించి సిద్ధం చేశామన్నారు.

పరిశీలకుని దృష్టికి ఫిర్యాదులు

టీడీపీ అభ్యర్థుల తరఫున నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో మంత్రులు ప్రభుత్వ వాహనాల్లో తిరగడం పట్ల వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రతినిధులు సీజీసీ సభ్యురాలు జక్కంపూటి విజయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి ఎంవీఎస్ మోహన్‌రావు ఫిర్యాదు చేశారు. నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలు ఈనెల 29న జరిగే ఎన్నికలపై పడుతుందని, ఎన్నికలు ముగిసే వరకూ ఓట్ల లెక్కింపు, ఫలితాలను వాయిదా వేయాలని సీపీఎం నగర కార్యదర్శి పలివెల వీరబాబు కోరారు. పొత్తులో కేటాయించిన 9 డివిజన్లలో తమ అభ్యర్థులు పోటీ చేస్తుండగా, తెలుగుదేశం రెబల్ అభ్యర్థులు నిబంధనలకు వ్యతిరేకంగా ఆ పార్టీ జెండా, చిహ్నం ఉపయోగించుకుంటూ తమ విజయావకాశాలను దెబ్బతీస్తున్నారని బీజేపీ ప్రతినిధి వి.శ్రీనివాసరాజు ఫిర్యాదు చేశారు. 47వ డివిజన్‌లోని 65–14–5 డోర్ నంబర్‌లో 256 ఓట్లు ఉన్నాయని దీనిపై పరిశీలన చేయాలని బీఎస్పీ ప్రతినిధి డి.వెంకట్ కోరారు.

పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్

పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు 10 శాతం రిజర్వుతో కలిపి 196 పోలింగ్ కేంద్రాలకు 216 ప్రిసైడింగ్ అధికారులు 216 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 723 ఇతర సిబ్బందిని నియమించగా ఆ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ఎన్ఐసీ అధికారులు నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ విశాల్ గున్ని, ఎన్ఐసీ అధికారులు ఉస్మాన్,సుబ్బారావు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ


పోలింగ్ సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న పరిశీలకులు రమణ

కాకినాడ సిటీ : కార్పొరేషన్ ఎన్నికల్లో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా క్రమబద్ధంగా నిర్వహించాలని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఎన్నికల పరిశీలకులు కేవీ రమణ ఆదేశించారు. రంగరాయ మెడికల కళాశాల ఆడిటోరియంలో మంగళవారం పీవో, ఏపీవోలకు ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారికంగా అనుమతించిన వ్యక్తులను మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలకు పద్ధతి ప్రకారం సీల్ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో 196 మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అలీంభాషా, డీఆర్‌డీఏ పీడీ మల్లిబాబు, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ విజయ్‌కుమార్, అర్బన్ తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాబలం లేకే ప్రలోభాలు

- నీతిమంతమైన పాలనైతే టీడీపీకి అంత భయమెందుకో?
- కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు చెవిరెడ్డి విమర్శ


ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ : కోట్లలో నల్లధనం పారించైనా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలలో పరువు దక్కించుకోవడానికి టీడీపీ నేతలు పాకులాడుతున్నారని వైఎస్సార్‌సీపీ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి విమర్శించారు. కాకినాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాబలం లేకపోవడం వల్లే టీడీపీ వారిలో భయం, తపన కనిపిస్తున్నాయని, డివిజన్‌కు కోటి రూపాయల వరద పారించడానికి ఆ పార్టీ నాయకులు సిద్ధమైపోయారని అన్నారు. నిజంగా మూడేళ్లలో అభివృద్ధి చేసి ఉన్నట్లయితే ఎన్నికలంటే అంత భయపడాల్సిన అవసరమేమిటన్నారు. చివరకు చంద్రబాబే స్వయంగా రెండ్రోజుల పాటు కాకినాడలో తిష్టవేసి మంత్రాంగం నడపడానికి వస్తున్నారంటే వారిలో భయం ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చన్నారు. చంద్రబాబు పతనానికి గోదావరి ప్రజలు కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల నుంచి నాంది పలకాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన వేణు, రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, మిండకుదిటి మోహన్, నక్కా రాజబాబు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గుర్రం గౌతమ్ పాల్గొన్నారు.

- మేయర్ పీఠం వైఎస్సార్‌సీపీకే ఖాయం
- ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

గుండాగిరీకి కాదు.. గాంధీగిరీకే ఓటు


3వ డివిజన్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్ :

కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని వైఎస్సార్‌సీపీ అధిష్టించడం ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సాయంత్రం 3వ డివిజన్ గొడారిగుంటలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుర్రాల వెంకటేష్ (స్టీఫెన్)కు మద్దతుగా కార్యకర్తలు ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌లతో కలసి ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. టీడీపీ నాయకులు తమ పార్టీ అభ్యర్థులు ఓడిపోతారన్న భయంతో గూండాయిజాన్ని ప్రోత్సహించి ప్రజలను భయపెడుతున్నారని ఓటర్లు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటు వేసే ప్రజలు గాంధీగిరినే కోరుకుంటారని, రౌడీయిజాన్ని తిప్పి కొడతారని ఉమ్మారెడ్డి స్పష్టం చేశారు. మూడో డివిజన్‌లో ప్రజలు నిర్భయంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుర్రాల స్టీఫెన్‌ను గెలిపించుకొని, తమ ప్రాంతాలను అభివృద్ధికి చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతం దుస్థితి చూస్తే ఇది కాకినాడ స్మార్ట్ సిటీయా లేక ఏదైనా గిరిజన ప్రాంతంలో ఉన్నామా! అన్న అనుమానం వ్యక్తం అవుతోందని ఉమ్మారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే, డివిజన్ ఇన్‌ఛార్జి మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ ఓటర్లు ముఖ్యంగా తమకు అనుకూలంగా ఉన్న మంచి వ్యక్తిని ఎన్నుకోవాలే తప్ప, గుండాయిజాన్ని, రౌడీయిజాన్ని ప్రోత్సహించే నాయకులను కాదని అన్నారు. స్టీఫెన్ లాంటి నాయకులు డివిజన్‌లో అరుదుగా ఉంటారని, ఏ ఒక్కర్ని అడిగినా స్టీఫెన్ చాలా మంచి వ్యక్తి అని చెబుతున్నారని, అటువంటి వ్యక్తి కార్పొరేటర్ అయితే ఎంతో అభివృద్ధి జరుగుతుందని విజయప్రసాద్ అన్నారు. 3వ డివిజన్‌లో టీడీపీకి చెందిన బొడ్డు మహేష్, కొండేల సూర్యనారాయణ, సామేల్ రాజుల నాయకత్వంలో 200 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, వడ్డి మణికుమార్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మూడో డివిజన్ ఇన్‌ఛార్జి మాదబోయిన నేరేళ్ల, కర్నాశుల సీతారామాంజనేయులు, మాజీ మంత్రి కొప్పన మోహనరావు, గుర్రాల పద్మ, ధనలత, మంతిన రవిరాజు, జిన్నూరి బాబి పాల్గొన్నారు.


బాలయ్యా.. రాకుంటేనే మేలయ్యా!

- ఇదీ కాకినాడలో టీడీపీ శ్రేణుల మనోగతం
- నంద్యాలలో 'నోట్ల' నిర్వాకంతో పార్టీకి నష్టం
- ఆయన ప్రచారానికి వస్తే చేటని అభ్యర్థుల కలవరం

భానుగుడి (కాకినాడ) :

మొన్నటి వరకూ 'తొడగొట్టి' అభిమానులకు ముచ్చటగొలిపిన హీరో నందమూరి బాలకృష్ణ.. ఇప్పుడు ఆ అభిమానులనే కొడుతూ హడలెత్తిస్తున్నారు. నటునిగా హిట్లు కొట్టే మాటెలా ఉన్నా.. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారం సందర్భంగా బాహాటంగా నోట్లు పంచిన ఘనతా ఆయనదే. బాలయ్య అభిమానులను కొట్టడం, నోట్లు పంచడం ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. నంద్యాలలో పార్టీ పరువును బాలయ్య బజారున పడేశారని టీడీపీ నేతలు వాపోతున్నారు. ఆయన నోట్ల పంపకంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలు అంటూ ఆంగ్లపత్రికలు సైతం తీవ్రంగా విమర్శించడంతో పార్టీని జాతీయస్థాయిలోనూ తలదించుకునేలా చేశారని మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారానికి వస్తే.. మేలు కన్నా కీడే ఎక్కువని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఆయన ఎక్కడ వస్తారోనని టీడీపీ అభ్యర్థులు బెంబేలెత్తుతున్నారంటున్నారు.

ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు నందమూరి బాలకృష్ణతో కాకినాడలో ప్రచారం నిర్వహించే దిశగా ప్రణాళిక రచించాలని సమన్వయ కర్తలను ఆదేశించారని పార్టీ వర్గాలంటున్నాయి. అయితే దీన్ని ద్వితీయ శ్రేణి నాయకులు గట్టిగా వ్యతిరేకించారని, బాలయ్య నగరంలో ఏ డివిజన్లో ప్రచారం నిర్వహించినా అక్కడ డిపాజిట్ గల్లంతయ్యే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారని తెలిసింది. నంద్యాలలో చేసిన నిర్వాకం పునరావృతమైతే.. అసలే ఓటరు ఫాలోయింగ్ అంతంతమాత్రంగా ఉన్న కాకినాడలో తుడిచి పెట్టుకుపోతామని కలవరపడ్డట్టు సమాచారం. దీంతో బాలయ్య ప్రచారంపై మంత్రులు పునరాలోచనలో పడ్డారంటున్నారు.



నేతలకు 'బాబు' తలంటు తప్పదా!

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 24, 25 తేదీలలో జిల్లాకు వచ్చే అవకాశాలున్నాయి. ఆయన పర్యటనకు సంబంధించి సోమవారం ఉదయం యనమల, రాజప్ప జిల్లాపార్టీ కార్యాలయంలో చర్చించారు. గెలుపు అవకాశాలు లేని అన్ని డివిజన్లలో చంద్రబాబు పర్యటన ఉండేలా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయడానికి సమాయత్తమయ్యారు. ఒక బహిరంగ సభ, పలు డివిజన్లలో రోడ్‌షోలు చేసేలా పర్యటన ఉంటుందని తెలుగుతమ్ముళ్ళు అంటున్నారు. అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రి పర్యటన మాటెలా ఉన్నా ఆయనొచ్చి ఇక్కడి నేతలకు తలవాచేలా చీవాట్లు పెట్టే అవకాశం ఉందంటున్నారు. డివిజన్ల వారీ ఇంటెలిజెన్స్ రిపోర్టును బట్టి రెండంకెల స్థానాలను సైతం గెలవలేని స్థితికి పార్టీ చేరిందన్న సమాచారంతోనే చంద్రబాబు నేతలపై ఫోన్‌లోనే మండిపడ్డారంటున్నారు. ఆయన పర్యటనలో డివిజన్ల వారీ బాధ్యులతో సమావేశం ఉండడంతో ఎవరికి క్లాస్ పీకుతారోనని భయం పట్టుకుంది.